సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 22.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 292
పేజీలు: 08 వెల: రూ. 5

## విశ్వసనీయ వార్తలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం
02



ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సులో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

- జెన్ జీ పై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారం అందించాలి
- సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మోదీ రాకతో మొదలైన
## పాక్ పతనం
### పదేళ్లలో కథ మారింది

*గత పదేళ్లలో భారత్–పాకిస్తాన్ మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలలో వ్యూహాత్మక మార్పులు నమోదయ్యాయి. 2014 తర్వాత భారత్ అనుసరించిన వైఖరితో పాటు పాకిస్తాన్ ఎదుర్కొంటున్న తీవ్రమైన అంతర్గత నిర్మాణాత్మక లోపాలు ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. నకిలీ కరెన్సీ నియంత్రణ, దౌత్యపరమైన తీవ్ర ఒత్తిడి, వాణిజ్య పరిమితులు వంటి చర్యలు ప్రభావం చూపినప్పటికీ, పాక్ ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి నిరంతర పాలనా వైఫల్యాలు, అధిక రుణాలు రాజకీయ అస్థిరతే ప్రధాన కారణాలని ఆర్థిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.*

-ముద్ర డెస్క్ :

- 2000లో భారత్ కంటే ముందంజ
- ఇప్పుడు పాక్ తలసరి రాబడి ఘోరం
- ఉగ్రవాదంపై రాజీలేని మోదీ నైజం
- పాకిస్తాన్‌కు పెరిగిన దౌత్య ముప్పు

అప్పులు, రాజకీయ అస్థిరతతో కుదేలైన పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ

04

## ఇమ్రాన్‌ఖాన్, ఆసిమ్ మునీర్ రాజీ!
### పాకిస్తాన్ రాజకీయాల్లో కీలక మలుపు

- జైలు నుంచి ఇమ్రాన్ విడుదలకు సిద్ధమవుతోందా?
- ఆర్మీతో ఇమ్రాన్ సయోధ్య.. మునీర్‌తో డీల్‌కు ఇమ్రాన్ ఓకే?
- పీటీఐలో హాట్ టాపిక్

02



# రేవంత్ టూర్ రద్దు
## సీఎం రేవంత్‌కు కేంద్రం షాక్
### అమెరికా వెళ్లేందుకు రాని పర్మిషన్

- అనుమతి నిరాకరించిన కేంద్ర ప్రభుత్వం
- ప్రస్తుతం బ్రిటన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి
- తొలుత అక్కడి నుంచే 23న అమెరికా వెళ్లేలా ప్లాన్
- అనుమతి నిరాకరణతో లండన్ నుంచి రిటన్ జర్నీ
- అమెరికాకు అధికారుల బృందం పంపేందుకు యోచన



**ముద్ర , హైదరాబాద్:**
సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. ఈనెల 23న లండన్ నుంచి అమెరికా వెళ్లాల్సి ఉంది. ఈ మేరకు టూర్ షెడ్యూల్ కూడా రెడీ అయింది. కానీ, రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం నిరాకరించడంతో లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగిరానున్నారు.
రెండు రోజుల క్రితం ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశానికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అక్కడి నుంచి నేరుగా లండన్ పర్యటనకు వెళ్లారు.. శుక్రవారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్ ను ఆయన సందర్శించనున్నారు. సాయంత్రం ఎమిరేట్స్ స్టేడియంలో జరిగే ఈపీఎల్ ఫుట్‌బాల్ ప్రజంటేషన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. 22న కేంబ్రిడ్జ్ బృందంతో సమావేశం అవుతారు. ఆ తరువాత లండన్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొనున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఆగస్టు 23వ తేదీన లండన్ పర్యటన ముగించుకొని అమెరికా వెళ్లాల్సి ఉంది. అయితే, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లేందుకు అనుమతి నిరాకరించింది. దీంతో అమెరికా పర్యటనను రద్దు చేసుకొని 23న లండన్ నుంచి హైదరాబాద్‌కు సీఎం తిరిగి రానున్నారు.

**నేడు, రేపు బిజీబిజీ**
లండన్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. నేడు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సందర్శిస్తారు. సాయంత్రం ఎమిరేట్స్ స్టేడియంలో జరిగే ఈపీఎల్ ఫుట్‌బాల్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి హాజరవుతారు. 22న కేంబ్రిడ్జ్ బృందంతో సమావేశం కానున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను, సాయంత్రం లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శిస్తారు. ఆగస్టు 23న సీఎం లండన్ పర్యటన ముగించుకొని నేరుగా హైదరాబాద్‌కు చేరుకుంటారు.

**కేంద్రం నిర్ణయానికి కారణం ఇదే..**
ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 23న అమెరికాలో పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ముఖ్యమంత్రులు విదేశీ పర్యటనలకు సంబంధించి ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం.. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. లండన్, అమెరికా పర్యటనల కోసం అనుమతి మిగతా 02లో



రాయదుర్గం భూముల వేలానికి
# లైన్ క్లియర్
## వేలంపై స్టేకు సుప్రీం నో

- హైకోర్టులోనే వివాదం తేల్చుకోవాలన్న కోర్టు
- 11 ఎకరాల భూముల వేలానికి లైన్ క్లియర్
- కంచ గచ్చిబౌలి భూములతో సంబంధం లేదన్న ప్రభుత్వం
- రాయదుర్గంలో ఎకరా రూ.264 కోట్లు
- టీజీఐఐసీ వేలంలో రికార్డు ధర

**ముద్ర హైదరాబాద్:**
హైదరాబాద్‌లోని రాయదుర్గం పాన్‌మక్తాలో భూముల వేలానికి లైన్ క్లియర్ అయింది. రాయదుర్గంలోని 11 ఎకరాల భూముల వేలం ప్రక్రియను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వివాదాలుంటే హైకోర్టులో తేల్చుకోవాలని సూచించింది. కంచ గచ్చిబౌలి వివాదాస్పద భూములకు, వీటికి సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది.
రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఏవైనా అభ్యంతరాలు లేదా వివాదాలు ఉంటే సంబంధిత పిటిషనర్లు తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. రాయదుర్గం పాన్‌మక్తా పరిధిలోని 2 సర్వే నంబర్లలో ఉన్న సుమారు 11 ఎకరాల భూమి విక్రయం కోసం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (TGIIC) వేలం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ వేలంలో ఒక్కో ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధరను (అప్‌సెట్ ప్రైస్) నిర్ణయించారు. అయితే, ఈ భూముల వేలాన్ని సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేశారు.
గతంలో కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, అప్పట్లో పరిరక్షించాలని ఆదేశించిన భూములనే ప్రభుత్వం ఇప్పుడు వేలానికి ఉంచగా నోటిఫికేషన్ ఇచ్చిందని పిటిషనర్ తరఫు సీనియర్ లాయర్ నీరజ్ కిషన్ కౌల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ మిగతా 02లో

## మంత్రి సురేఖకు రాజీనామా సెగ
### సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వ్యతిరేక గళం

**ముద్ర డెస్క్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలుఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించాల్సిన బాధ్యత మంత్రి కొండా సురేఖపై ఉందంటూ పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఏకంగా 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా మీడియా సమావేశం నిర్వహించి.. కొండా సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరడం చర్చనీయాంశంగా మారింది. సీఎల్పీలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్‌లు బల్మూరి వెంకట్, వేముల వీరేశం సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా 02లో

- ముఖ్యమంత్రి రేవంత్ పై విమర్శలతో ఆగ్రహం
- తక్షణం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్
- రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేయాలని పట్టు
- పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరించాలన్న మెజార్టీ ఎమ్మెల్యేలు



## వైభవంగా వరలక్ష్మీ పూజలు
### కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయంలో పోటెత్తిన మహిళలు

- తెలంగాణ వ్యాప్తంగా మహిళల వ్రతాలు
- బోడుప్పల్ శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో పూజలు

03



## నెలకు ₹350కే టోల్ పాస్
ఎన్నిసార్లు అయినా వెళ్లవచ్చు
02

- వాహనదారులకు మంచి ఛాన్స్..
- ప్లాజాకు 20 కి.మీ పరిధిలోని వారికి..
- వచ్చే నెల నుంచి అమలు
- ఎన్.హెచ్ఏఐ బంపర్ ఆఫర్
- రాజమార్గయాత్ర మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు




ఇదీ AI
ముద్ర



చమట దుర్వాసనకు యాంటీపెర్స్పిరెంట్ వాడాలి




చెమటను తగ్గించేందుకు అల్యూమినియం ఆధారిత యాంటీపెర్స్పిరెంట్‌ను ఉపయోగించవచ్చు. రాత్రిపూట వాడితే కొందరికి మెరుగైన ఫలితం ఉంటుంది.



# మంత్రి సురేఖకు రాజీనామా సెగ

(మొదటి పేజీ తరువాయి)
వారు కొండా సురేఖ కుటుంబంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై బహిరంగంగా విమర్శలు చేయడం క్రమశిక్షణా రాహిత్యమేనని వారు అభిప్రాయపడ్డారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ చెప్పడం సరికాదని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సొంత కుమార్తె ముఖ్యమంత్రిపై తీవ్ర వ్యాఖ్యలు చేసినప్పుడు తల్లి వాటిని బహిరంగంగా ఖండించాలని డిమాండ్ చేశారు. పార్టీలో ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే సీఎల్పీ, పీసీసీ, పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న వ్యక్తులు పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీలో ఉంటూ ముఖ్యమంత్రి నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకించడం సరికాదని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎంతో కష్టపడ్డారని పేర్కొన్నారు. సీఎం, పార్టీపై విమర్శలు చేయడం ద్వారా సొంత పార్టీకి నష్టం కలిగించినట్లవుతుందని వ్యాఖ్యానించారు.
'చెట్టు మీద ఉండి అదే చెట్టు కొమ్మను నరుక్కోవడం' లాంటి వైఖరి సరికాదని వేముల వీరేశం తీవ్రంగా వ్యాఖ్యానించారు. కొండా సురేఖ గతంలోనూ తన వ్యాఖ్యలతో పార్టీకి ఇబ్బందులు తెచ్చారని ఆరోపించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి, సీఎం రేవంత్‌రెడ్డికి కొండా సురేఖ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం మరింత ముదరడంతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. అంతేకాకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు పార్టీ నుంచి కూడా తొలగించాలని కోరారు. పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని కేబినెట్‌లో కొనసాగించవద్దని సీఎల్పీ వేదికగా నేతలు స్పష్టం చేశారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను మంత్రి సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య తప్పుబట్టారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకోవాలని.. ముఖ్యమంత్రిపై బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని తేల్చి చెప్పారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్.. కొండా కుటుంబం ప్రతిపక్షాల తరహాలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రిని వ్యతిరేకించే వారికి కాంగ్రెస్‌లో కొనసాగేందుకు అర్హత లేదని.. కొండా సురేఖపై అధిష్ఠానం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే మంత్రి సురేఖపై పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# నెలకు రూ.350కే టోల్ పాస్

**ముద్ర, డెస్క్:**
టోల్ గేట్ల సమీపంలో నివసించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగించింది. ఇకపై ప్రతీసారి మీరు టోల్ చెల్లించనక్కర్లేదు. ఒక్కసారి పాస్ తీసుకుంటే నెల రోజుల పాటు ఎన్నిసార్లు అయినా ఉపయోగించుకోవచ్చు. రోజువారీ పనులు, ఇతర సాధారణ ప్రయాణాల కోసం టోల్ ప్లాజాల సమీపంలోని ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. చిన్న దూరానికి కూడా ప్రతీసారి టోల్ ఛార్జీ చెల్లించాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు లోకల్ పాస్ వ్యవస్థను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(NHAI) తీసుకొచ్చింది. డిజిటల్ ఫాస్టాగ్ లోకల్ పాస్‌ను ప్రవేశపెట్టింది. తాజాగా దేశవ్యాప్తంగా 121 టోల్ ప్లాజాలకు దీనిని వర్తింపచేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ పాస్ ఎలా పొందాలి? ప్రాసెస్ ఎలా? అనేది చూద్దాం.
టోల్ ప్లాజా నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో నివసించే ప్రజలు లోకల్ పాస్ పొందవచ్చు. ఈ పాస్ ధర రూ.350 నుంచి ప్రారంభమవుతుంది. వాహనం కేటగిరీని బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. ఈ పాస్ నెల రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. నెల రోజుల పాటు టోల్ ప్లాజా గుండా అపరిమిత ప్రయాణం చేయవచ్చు. ప్రతీసారి మీరు ప్రత్యేకంగా టోల్ ఛార్జీ చెల్లించాల్సిన అవసరం ఉండదు. రోజువారీ పనులు లేదా ఇతర సాధారణ ప్రయాణాల కోసం ఒక టోల్ ప్లాజా గుండా రోజూ వెళ్లే ప్రయాణికులకు ఈ పాస్ వల్ల ఉపయోగం కలగనుంది. అయితే ఈ పాస్ ప్రతీ టోల్ ప్లాజా వద్ద అమలు చేయడం లేదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 121 టోల్ గేట్ల వద్ద అమలు చేస్తున్నారు. దీంతో మీరు తరచూ రాకపోకలు సాగించే టోల్ ప్లాజా వద్ద ఈ వ్యవస్థ అమల్లో ఉందో లేదో తెలుసుకోవాలి.
కేంద్ర ప్రభుత్వానికి చెందిన రాజమార్గ యాత్ర యాప్ ద్వారా మీరు ఈ లోకల్ పాస్ పొందవచ్చు. యాప్‌లో జీఐఎస్ ఆధారిత ధృవీకరణ ఫీచర్ ఉంటుంది. మీరు యాప్ ఓపెన్ చేయగానే టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నారో.. లేదో గుర్తిస్తుంది. అలాగే ప్రయాణికుడి అడ్రస్, వాహన వివరాలు, ఫాస్టాగ్ వంటి సమాచారాన్ని డిజిలాకర్, వాహన్ వంటి ప్రభుత్వ ప్లాట్ ఫామ్స్ ద్వారా ధృవీకరించి సమీప ప్రాంతాల్లో నివసిస్తున్నా.. అనేది గుర్తిస్తుంది. మీరు అడ్రస్ ప్రూఫ్ కు ఫిజికల్ పత్రాలను విడిగా సమర్పించాల్సిన అవసరం ఉండదు. అడ్రస్, వెహికల్ వివరాలు, ఫాస్టాగ్, టోల్ స్థానం జీఐఎస్ ధృవీకరిస్తుంది.





Image posted on X by @OfficialDGISPR

# ఇమ్రాన్‌ఖాన్, ఆసిమ్ రాజీ!

**ముద్ర డెస్క్ :**
పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ మధ్య రాజీ ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మూడేళ్లుగా జైలులో ఉన్న ఇమ్రాన్ ను తాజాగా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే ఇమ్రాన్ ను త్వరలోనే విడుదలకు ఈ సయోధ్య మార్గం చూపొచ్చని అంచనాలు వినిపిస్తున్నాయి. జైలు నుంచి బయటకు వచ్చినా ఆర్మీని నేరుగా ఢీకొనకుండా ఉండేందుకు ఇమ్రాన్ సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు రావడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది. డీల్ కుదిరితే ఇమ్రాన్‌తో పాటు ఆయన పార్టీ పీటీఐకి కూడా కొంత ఊరట లభించే అవకాశం ఉంది. అయితే ఈ రాజీ కుదిరిందా? ఇమ్రాన్ తన గత వైఖరిని మార్చుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారిం ది. ఈ పరిణామం పాకిస్తాన్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది.

# విశ్వసనీయ వార్తలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

**ముద్ర, హైదరాబాద్:**
డిజిటల్ యుగంలో వేగం కంటే వార్తలో వాస్తవికత, నిష్పక్షపాతం, విశ్వసనీయతే అత్యంత ముఖ్యమని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. "ముందు నిజ నిర్ధారణ చేయాలి.. ఆ తర్వాతే వార్తను ప్రసారం చేయాలి" అని ఆయన జర్నలిస్టులకు సూచించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్ తాజ్ కృష్ణ లో నిర్వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తొలి జాతీయ సదస్సును గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం మాత్రమే కాదని, సమాజానికి కళ్లు, చెవులు, ప్రజల గొంతుక అని గవర్నర్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదిక పైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, సామాజిక భద్రత, వృత్తి పరమైన అభివృద్ధికి ఫెడరేషన్ దోహదపడాలని ఆకాంక్షించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు జర్నలిజానికి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని, అదే సమయంలో డీప్‌ఫేక్స్, ఏఐ రూపొందించిన వీడియోలు, తప్పుడు సమాచారంతో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేప థ్యంలో జర్నలిస్టుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. సోషల్ మీడియా ప్రభావంతో జెన్–జీ ఆలోచనా విధానం మారుతోంది – యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అన్నారు. వేగం కంటే వాస్తవ నిర్ధారణ ముఖ్యం అని పేర్కొన్న గవర్నర్ సోషల్ మీడియా ట్రెండ్స్, ఫేక్ న్యూస్‌కు లోనుకాకుండా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అందించాలనీ జర్నలిస్టులను కోరారు. సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫేక్ న్యూస్‌ను ఎదుర్కొనేందుకు డిజిటల్ లిటరసీ, ఏఐ లిటరసీ, ఫ్యాక్ట్ చెకింగ్ వంటి అంశాలపై ఫెడరేషన్ అవగాహన పెంచాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని అరికట్టడం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, మీడియా, సాంకేతిక సంస్థలు, పౌరులందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు.
'నశా ముక్త్ భారత్', 'టీబీ ముక్త్ భారత్' వంటి జాతీయ కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మలచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. తమ రచనలు, వార్తా సంస్థలు, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జర్నలిస్టులను కోరారు. ఫెడరేషన్ రాజకీయాలకు అతీతంగా సమ్మిళిత, ప్రజాస్వామ్య వేదికగా ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు. జాతీయ సదస్సు భారతీయ జర్నలిజాన్ని మరింత బలోపేతం చేసి, విశ్వసనీయంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దే దిశగా దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, 'ద హిందూ' గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రామ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు గౌతమ్ లాహిరీ, తదితరులు పాల్గొన్నారు.






# రేవంత్ టూర్ రద్దు

(మొదటి పేజీ తరువాయి)
కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాత్రం కేవలం లండన్ పర్యటనకు మాత్రమే అనుమతి ఇచ్చింది. అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. దీంతో సీఎం రేవంత్ అమెరికా పర్యటన రద్దయింది.

**కారణం బయటపెట్టిన విదేశాంగ శాఖ**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. దీనిపై విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పందించారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు అనుమతి మంజూరు చేసే ముందు ఆ వివరాలను విదేశీ వ్యవహారాల శాఖ పరిశీలిస్తుంది. వారు చేసే పర్యటన.. నిర్వహిస్తున్న పదవి ఉద్దేశానికి తగినట్లుగా ఉండాలి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి యూకే పర్యటనకు అనుమతి లభించింది. అమెరికా పర్యటన విషయంలో మాత్రం ఆ నిబంధనలను పాటించలేదు. అందుకే అనుమతి నిరాకరించాం'' అని రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

# రాయదుర్గం భూముల వేలానికి లైన్ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)
న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఈ వాదనలను తీవ్రంగా ఖండించారు. పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో స్టే ఇచ్చిన భూములకు, ప్రస్తుతం వేలం వేస్తున్న భూములకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. కంచ గచ్చిబౌలి భూములకు, ఇప్పుడు టీజీఐఐసీ వేలం వేస్తున్న ప్రాంతానికి మధ్య సుమారు 5 కిలోమీటర్ల దూరం ఉందని స్పష్టమైన ఆధారాలు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వినిపించిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న CJI ధర్మాసనం, టీజీఐఐసీ జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది.

**హైకోర్టులో దక్కని స్టే**
రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూముల వేలాన్ని నిలిపివేసేందుకు హైకోర్టు ఇదివరకే నిరాకరించింది. సర్వే నంబర్లు 83/1, 83/పార్ట్‌లో ఉన్న 11.12 ఎకరాల వేలంపై దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లపై సింగిల్ జడ్జీలు విచారణ జరిపి మధ్యంతర స్టే ఇవ్వడానికి నిరాకరించింది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం పిటిషనర్లు ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్ఆర్‌టీ)ని ఆశ్రయించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, పునర్విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు నిరూపించకుండా ప్రభుత్వ వేలాన్ని అడ్డుకోలేమని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ స్పష్టం చేశారు. మరోవైపు, ప్లాట్ల వేలాన్ని సవాల్ చేస్తూ ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ నగేష్ భీమపాక.. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వం, హెచ్ఎండీఏలను ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేశారు.



**సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ వేలం.. రికార్డు ధర**
నగరంలో భూముల ధరలు రికార్డు సృష్టిస్తున్నాయి. తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహిస్తున్న భూముల వేలం పాటల్లో భూమికి రికార్డు ధర పలికింది. రాయదుర్గంలో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరా రూ.264 కోట్లకు అమ్ముడైంది. రాయదుర్గం పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83 /1 లో 5.25 ఎకరాల భూమిని టీజీఐఐసీ వేలం వేసింది. గతంలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.237 కోట్లు పలికింది. కనీస ధర 175 కోట్ల రూపాయలుగా టీజీఐఐసీ నిర్ధారించింది. 10 కోట్ల రూపాయల డిపాజిట్‌గా అధికారులు నిర్ణయించారు. 10కోట్ల రూపాయలు డిపాజిట్ చెల్లించి ఆన్ లైన్ వేలంలో పాల్గొన్న బిడ్డర్లు.. ఖరీదైన భూమి కావడంతో పోటీపడి స్థిరాస్తి సంస్థలు బిడ్డింగ్ దాఖలు చేశాయి. 3 నెలల క్రితం ఇదే ప్రాంతంలో ఎకరా భూమి 237కోట్ల రూపాయలు పలికింది.



# రైతుల ఖాతాల్లోకే పరిహారం

**ముద్ర, హైదరాబాద్:**
భూసేకరణ, ఆర్అండ్ఆర్ పరిహారం కోసం ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి రూపాయి నేరుగా రైతులు, నిర్వాసితుల ఖాతాల్లోకి చేరాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ, అటవీ అనుమతులు అడ్డంకిగా మారకుండా మిషన్ మోడ్‌లో పనిచేయాలని కలెక్టర్లు, ఇంజినీర్లకు సూచించారు.
ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సంకల్పించిన రూ.5 వేల కోట్ల నిధుల లక్ష్యం నెరవేరాలంటే చెల్లింపుల్లో పరిపాలనా జాప్యానికి తావులేదన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న దాదాపు రూ.1,200 కోట్లను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. అవసరమైన పత్రాలు, లబ్ధిదారుల వివరాలు సిద్ధంగా ఉన్న చోట ఒకటి రెండు రోజుల్లోనే పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు.
కలెక్టర్ల పీడీ ఖాతాల్లో నిధులు జమ చేయడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదని, అవి రైతుల ఖాతాల్లోకి చేరినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని మంత్రి పేర్కొన్నారు. అవార్డులు, టోకెన్ల ప్రక్రియను ముందుగానే పూర్తి చేసి, అదనపు సిబ్బంది, ప్రత్యేక బృందాలతో చెల్లింపులను వేగవంతం చేయాలని సూచించారు. అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఇంజనీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, ఈఎన్‌సీ (అడ్మినిస్ట్రేషన్) శ్రీనివాస్, ఈఎన్‌సీ (ఓఅండ్ఎం & క్వాలిటీ కంట్రోల్) మధుసూదన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చమట దుర్వాసనకు బిగుతైన దుస్తులు వద్దు

గాలి సులభంగా ప్రసరించే కాటన్ దుస్తులు ధరించడం వల్ల చెమట, దుర్వాసన తగ్గే అవకాశం ఉంటుంది.



# ప్రజలకు మెరుగైన సేవలు

**నూతన ప్రభుత్వ కార్యాలయ భవనాలతో సమస్యలు దూరం**
**రిజిస్ట్రేషన్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకువస్తాం..**
**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**
**అభివృద్ధి సంక్షేమ మా ప్రభుత్వం లక్ష్యం: మంత్రి అడ్లూరి..**



**ముద్ర, జగిత్యాల న్యూస్:** జగిత్యాల జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగై సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి జగిత్యాల మున్సిపాలిటి పరిధిలోని ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సి.సి.ఎల్. ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎం .డి. హౌసింగ్ గౌతం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈసందర్బంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పర్యటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఒకే రోజు జగిత్యాల జిల్లాలో రూ. 11.80కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చూడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్లు, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, భీమారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్లు, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, మాల్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్లు, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి వివరించారు.

ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అధికారులు మరియు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనువైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. కార్యాలయాల నిర్మాణంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు ప్రధాన లక్ష్యాలుగా తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీరేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యులు ఎల్ .రమణ, చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం , వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, అదనపు కలెక్టర్ లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహ రావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్, రాయికల్ మున్సిపల్ చైర్మన్, ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖలో నిర్లక్ష్యంపై మంత్రి సీరియస్

**ముద్ర, హైదరాబాద్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో ఆయన సుమారు నాలుగు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించడంతో పాటు, మరికొందరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ రీ సర్వే, 22–ఏ కేసులు, అసైన్డ్ భూములు, భూ భారతి దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.

## రసూల్‌పల్లి అభివృద్ధికి పెండింగ్ పనులకు ప్రాధాన్యత

**ముద్ర, హన్మకొండ :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రసూల్‌పల్లి గ్రామంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామంలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలు తెలిపిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

# అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం పూజలు

**- తెలంగాణ వ్యాప్తంగా మహిళల వ్రతాలు**
**- కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయంలో పోటెత్తిన మహిళలు**
**- బోడుప్పల్ శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో విశేష పూజలు**





**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ చైతన్యపురిలోనీ శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు కొలువైవున్న మహిమా న్విత దివ్య క్షేత్రం 'శ్రీ మహాశక్తి దేవాలయం' వరలక్ష్మీ వ్రత వేడుకల తో జనసంద్రంగా మారింది. శ్రావణ శుక్రవారం, శ్రీ వరలక్ష్మీ వ్రత పూజ భక్తిశ్రద్ధలు, సంప్రదాయ వైభవం మధ్య ఈ వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. వరలక్ష్మీ వ్రత వేడుకలను పురస్కరించుకుని ఉదయం 7:30 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి, ఘనంగా మహా హారతి నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రధాన వేడుకగా వరలక్ష్మీ వ్రతము, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను అత్యంత భక్తిప్రప త్తులతో చేపట్టారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఈ పవిత్ర వేడుకలను దేవాలయ నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణాన్ని ఆకర్షణీయమైన పూల అలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

శ్రీ మహాశక్తి దేవాలయంలో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు భక్తుల పాలిట 'కొంగు బంగారం'గా విరాజిల్లుతున్నారు. ఇక్కడ వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించు కుంటే సకల సంపదలు, అష్టైశ్వర్యాలు, ఇంటా సుఖశాంతులు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

### నిమిషాంబ ఆలయంలో వరలక్ష్మి పూజలు

**- వేలాదిగా భక్తుల హాజరు**

**ముద్ర, బోడుప్పల్:** వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని బోడుప్పల్ శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలుజరిగాయి. బోడుప్పల్ లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మాతా నిమి షాంబ దేవి అమ్మవారు స్వర్ణకవ చాలంకృత అలంకరణలో, లక్ష్మీ దేవి శోభను సంతరించుకొని, దివ్యమైన కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ భక్తులకు మంగళకరమైన దర్శన భాగ్యాన్ని ప్రసాదించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం సాయంకాలం మహిళామణులచే సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె.అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్ , రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు ప్రత్యేక పూజలు చేశారు. ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్. సాయి బాబా (శ్యామ్), డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, ఎన్.రామకృష్ణ, ఎన్. మోహన్, డి.రామక్రిష్ణ, ఎన్.శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణ ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమాకాంత్ శర్మ పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ లో సవతుల పోరు

**అంతర్గత కలహాలతో బీఆర్ఎస్ కు మేలు**
**రేవంత్ నిక్కచ్చిగా ఉంటేనే అధికారుల్లో భయం**
**22ఏ భూముల నిబంధన దుర్వినియోగం**
**సీపీఐ సూచనలను సీఎం రేవంత్ పట్టించు కోవడం లేదు**
**సీపీఐ నేత కె.నారాయణ విమర్శలు**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు, అంతర్గత కలహాల కారణంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ఎలాంటి తప్పులకు తావులేకుండా పాలన సాగిస్తేనే మంత్రు లు, కిందిస్థాయి అధికారులు బాధ్యతగా పనిచేస్తారని నారాయణ సూచించారు. ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి అవసరమని పేర్కొన్నారు.

తెలంగాణలో 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపిం చారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి, అర్హులైన భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 22ఏ భూముల అంశంపై ఇటీవల ప్రభుత్వం కూడా సమీక్ష చేపట్టిన నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్ర ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదని కె.నారాయణ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌తో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నా మని తెలిపారు. ప్రభుత్వం తమ సలహాలు, సూచనలను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు, మిత్రపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలని నారాయణ సూచించారు.

## యూపీ సీఎం యోగితో బండి సంజయ్ భేటీ

**ముద్ర , ఢిల్లీ :** ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం లక్నోలో భేటీ అయ్యారు. దాదాపు అరగంటకుపైగా జరిగిన ఈ సమావేశంలో తెలంగాణలో బీజేపీ పరిస్థితి, యూపీ ఎన్నికలపై చర్చించారు. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, నాయకులంతా కలిసికట్టుగా పనిచేస్తే అధికారంలోకి రావడం ఖాయమని యోగి ధీమా వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలో యూపీలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

## సిఎం అమెరికా పర్యటన రద్దు వెనుక బీజేపీ కుట్ర

**- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు**



**ముద్ర, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వక పోవడం వెనుక బీజేపీ నేతల కుట్రలు ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు ఆరోపించారు శుక్రవారం బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనే "వికసిత్ భారత్" లో తెలంగాణ రాష్ట్రం ఉండొద్దనే కుట్రలు ఉన్నాయని తమకు అర్థం అవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు కోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్న తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టింస్తోందని విహెచ్ ఆరోపించారు. మెజారిటీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జనాభా దామాషాలో న్యాయం జరగాలన్న రాహుల్ గాంధీగారి లక్ష్యం కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కేంద్రం చేపట్టే జనగణన గణాంకాల్లో ఓబీసీ జనాభా లెక్కలు చూపకుండా బీజేపీ మోకాలడ్డుతుందని విహెచ్ విమర్శించారు. సీడబ్ల్యూసీలో నిర్ణయం తీసుకున్న ప్రకారం ఈ నెల 25వ తేదీన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## మహిళపై కాంగ్రెస్ నాయకుడి అత్యాచారం!

**పుల్లాయిగూడెంలో దారుణం**



**ముద్ర, ఆత్మకూరు :** యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పుల్లాయిగూడెం లో దారుణం. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని మహిళపై కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు అత్యాచారం. సిమెంట్ బస్తాలు ఇస్తానని ఇంటికి పిలిచి అత్యాచారం చేసిన గ్రామశాఖ అధ్యక్షుడు మాలి శంకర్ రెడ్డి. విషయం భర్తకు తెలిసి గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ. పోలీస్ స్టేషన్లో కేసు పెట్టకుండా బాధితురాలికి, భర్తకు బెదిరింపులు, కేసు పెట్టకుండా అర ఎకరం భూమి ఇస్తానని పెద్ద మనుషులతో రాయబారం. ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు.

## ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రపంచంలోని అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయంలో సీఎం తన ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు.ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు అంశాలతో పాటు పాలన, విద్య, ప్రజా విధానాలపై చర్చలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అభివృద్ధి, మెరుగైన పాలనకు సంబంధించిన అంశాలపై ఆక్స్‌ఫర్డ్ విద్యావేత్తలతో అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్‌తో ఆక్స్‌ఫర్డ్ యూని వర్సిటీకి ప్రత్యేక అనుబంధం ఉంది. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ కూడా ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

## ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ



**ముద్ర, రాజేంద్రనగర్:** ఎల్ నినో ప్రభావంతో తలెత్తే కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసిరి సీతక్క, వాకిటి శ్రీహరితో పాటు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కరవు పరిస్థితుల్లో పంటల మార్పిడి, పశుసంవర్ధకంపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. చెక్‌డ్యామ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి వ్యవసాయానికి వినియోగించాలని, మేకలు, గొర్రెల మేతకు ప్రత్యేక ప్రదేశాలను గుర్తించాలని తెలిపారు. చేపల పెంపకానికి అవసరమైన నీటి లభ్యతపై దృష్టి పెట్టాలని సూచించారు. ముందస్తు కార్యాచరణతో ఎల్ నినోను సమర్థవంతంగా ఎదుర్కొని తెలంగాణను మోడల్‌గా నిలపాలని అధికారులకు పిలుపునిచ్చారు.

## సరిహద్దుల్లో సశస్త్ర సీమా బల్ సేవలు అభినందనీయం

**- యూపీలో బండి సంజయ్**



**ముద్ర, లక్నో:** భారత్–నేపాల్, భారత్–భూటాన్ సరిహద్దుల భద్రతలో సశస్త్ర సీమా బల్ (SSB) సేవలు అభినందనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సరిహద్దు నిర్వహణ ఆధునీకరణలో SSB ముందంజలో ఉందని పేర్కొన్నారు. డ్రోన్లు, CCTV, థర్మల్ ఇమేజర్లు, నైట్ విజన్ పరికరాలు, GPS ఆధారిత గస్తీ, GIS వంటి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ భద్రతను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు.లక్నోలో SSB 4వ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన జవాన్ల బ్యారక్‌లు, మెస్, నివాస భవనాలను బండి సంజయ్ ప్రారంభించారు. గోరఖ్‌పూర్, మహారాజ్‌గంజ్‌లో పలు అభివృద్ధి పనులకు ఆన్‌లైన్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాలకు కేంద్రం రూ.191.29 కోట్లు మంజూరు చేసింది. జవాన్లు, వారి కుటుంబాల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి త్యాగాలను దేశం ఎప్పటికీ మరచిపోదని బండి సంజయ్ పేర్కొన్నారు.

## కొల్తూరు చెరువుల్లో కాలుష్యం.. ఈటల పరిశీలన

ముద్ర, మల్కాజిగిరి: కొల్తూరు గ్రామంలోని చెరువులు, కుంటలు పారిశ్రామిక వ్యర్థాలతో కలుషితమై చేపలు, పశువులు, పక్షులు మృత్యువాత పడుతున్నాయని తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం చెరువులను పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 22.08.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# గ్రీన్ టీ గురించి తెలుసుకోవాలి..

ఉదయం టీ తాగడం చాలా అవసరం. నిజమే ఇది ఒక అవసరం లా మారింది. చాలా మంది టీ, కాపీలతో తమ ఉదయాన్ని మొదలు పెడతారు. టీ, కాఫీ కంటే కొందరు గ్రీన్ టీ కూడా తాగుతారు. మరి ఈ గ్రీన్ టీ మంచిదా? నార్మల్ టీ మంచిదా? అనే అనుమానం మీలో కచ్చితంగా ఉండే ఉంటుంది కదా. ఇంతకీ ఏ టీ తాగాలి?



గ్రీన్ టీలో అసలు పాలు ఉండవు. అదే నార్మల్ టీలో పాలు ఉంటాయి. 100 ml పాలలో 80 నుంచి 90 కేలరీలు ఉంటాయి. అందుకే ఈ నార్మల్ టీ తాగితే ఈ కాలరీలు లభిస్తాయి. ఇక బరువు తగ్గాలి అనుకునే వారికి ఈ కాలరీలు అవసరం లేదు. అందుకే నార్మల్ టీకి బదులు గ్రీన్ టీ తాగడం చాలా మంచిది అంటున్నారు నిపుణులు. గ్రీన్ టీలో చక్కెర ఉండదు. అదే మామూలు టీలో మాత్రం కచ్చితంగా చక్కెర ఉంటుంది. కొందరు మరింత ఎక్కువే తాగుతారు. 100 గ్రాముల చక్కెరలో 400 గ్రాముల కేలరీలు ఉంటాయి. అంటే నార్మల్ టీ కంటే గ్రీన్ టీ బెటర్.

గ్రీన్ టీ లో నీరు, కషాయం మాత్రమే ఉంటుంది కాబట్టి అందులో జీరో క్యాలరీలు ఉంటాయి. సో బరువు తగ్గాలి అనుకునే వారికి ఇది చాలా మంచి ఎంపిక. అయితే కొందరు టీ తాగితే బరువు పెరుగుతారు అని నమ్ముతారు. కానీ ఇందులో కూడా నిజం ఉంది. ఎందుకంటే అందులో ఉండే క్యాలరీలే దీనికి కారణం. చక్కెర, పాలలో ఉండే క్యాలరీల వల్ల బరువు పెరుగుతారు. కానీ కేవలం ఒక కప్పు, రెండు కప్పులకు మాత్రమే కాదు. స్టాఫ్ తో ఒక సారి, కొలీగ్ తో ఒకసారి, ఇంట్లో ఉదయం, సాయంత్రం ఒకసారి ఇలా ఓ 8 నుంచి 10 సార్లు టీ తాగేవారు కచ్చితంగా బరువు పెరుగుతారు అంటున్నారు నిపుణులు.

బరువు, షుగర్ లు పెరగకుండా ఉండటానికి ఈ పంచదార, షుగర్ తీసి గ్రీన్ టీ తాగాలి. అయితే టీ కూడా మంచిదే. ఇందులో థీన్ అనే మెడిసిన్ ఉంటుందట. ఒక కప్పు ఛాయ్ లో 150 మి. గ్రాముల థీన్ ఉంటుంది. దీని వల్ల శరీరం చాలా త్వరగా యాక్టివ్ అవుతుంది. చాలా ఉత్సాహంగా పని కూడా చేస్తారు. ప్రయోజనం ఉందని ఎక్కువగా తీసుకుంటే మాత్రం చాలా ప్రమాదంలో పడతారు. పదే పదే తాగితే మీరు నీరు కూడా తాగలేరు. నీరు కంటెంట్ చాలా తక్కువ అవుతుంది. సో జాగ్రత్త. మీరు బరువు లేకపోతే ఈ టీ తాగవచ్చు. కానీ రోజు రెండు కప్పులు మాత్రమే తాగండి.

# ఒత్తిడి లేని లైఫ్

స్ట్రెస్ స్ట్రెస్ స్ట్రెస్.. చాలామంది ఇప్పుడు ఇదే ఒత్తిడితో బాధ పడుతున్నారు. ఎవరిని చూసినా ఏదో ఒక రకమైన ఒత్తిడి ఉంటుంది. చదువు, పిల్లలు, ఉద్యోగం, లైఫ్, ప్రజెంట్, ఫ్యూచర్, ఉద్యోగం, కెరీర్ ఇలా ఏదో ఒక విధమైన టెన్షన్ మాత్రం పక్కా అనే విధంగా ఉంటుంది. ఈ ఒత్తిడి వల్లనే అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయి. గుండె సంబంధ సమస్యలు, మానసికంగా కుంగి పోవడం, తలనొప్పి, మరిన్ని అనారోగ్య సమస్యలు కూడా వస్తాయి. 20లో 60లా కనిపించడం, జుట్టు పోవడం వంటివి ఎన్నో వస్తాయి. అందుకే ఒత్తిడి లేకపోతే మీరు హ్యాపీ. ఇంతకీ ఒత్తిడి నుంచి దూరం అవ్వాలంటే ఏం చేయాలో తెలుసా? ఒకసారి ఈ ఆర్టికల్ చదివేయండి.

### సోషల్ మీడియా:

సగం దరిద్రం అందులోనే ఉంటుంది. ఎదుటి వారి లైఫ్ ను చూసి మనకు అలాంటి లైఫ్ లేదు అనుకోవడం, డబ్బు సంపాదించాలనే దురాశ, ఎంజాయ్ వంటి అనవసరైమన అలవాట్లు వీటి వల్లనే వస్తాయి. అవి లేకపోతే కుంగిపోయి తెగ టెన్షన్ పడుతుంటారు. లైఫ్ కు అసలు అర్థమే లేదు అని తెగ ఫీల్ అవుతుంటారు. అసలు మనది కూడా ఒక లైఫా అంటూ బాధ పడతారు. సినిమాలు, సీరియల్స్, కొందరి ఇంటి, ట్రిప్ వ్లాగ్స్ కూడా చాలా మందిని నిరాశలోకి నెట్టేస్తున్నాయి. అందుకే ముందుగా ఈ దరిద్రానికి దూరం అవ్వండి అంటున్నారు నిపుణులు. అవసరం అయినవి మాత్రమే చూసి ఆ ఫోన్ ను పక్కన పెట్టండి.

### దూరం:

మీ లైఫ్ లో మీ చుట్టు అవసరమైన వారు ఉంటారు. నార్మల్ పీపుల్స్ ఉంటారు. అనవసరమైన వారు కూడా ఉంటారు. అవసరమైన, కామన్ పీపుల్స్ తో పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ ఈ అనవసరమైన వారితో లైఫ్ లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సో జాగ్రత్త. మీ మనశ్శాంతిని కూడా వారు లాగేసుకుంటారు. జాగ్రత్త. వీరిని వీలైనంత దూరం పెట్టండి.

### స్నేహితులు:

స్నేహితులు కుప్పలు కుప్పలు ఉంటారు. కానీ అందులో నీ మేలు కోరే వారు ఎవరు? నీ చెడు కోరే వారు ఎవరు? నీ కష్టాల్లో తోడు వచ్చేది ఎవరు? నీతో నిలిచేది ఎవరు? అనే విషయం మీద నీకు కచ్చితంగా క్లారిటీ ఉండాలి. మంచి స్నేహితులను వదులుకోకు. చెడు స్నేహితులను వదిలి సంతోషకరమైన జీవితాన్ని సాగించు. లేదంటే ఆ స్నేహాల వల్ల నువ్వు అనుకోని చెడు సావాసాలతో జీవితాన్ని నాశనం చేసుకునే రోజు రావచ్చు. ముందే జాగ్రత్త.

### వద్దు, కాదు:

కొందరు వద్దు, లేదు, కాదు అనే మాటలు చెప్పడానికి చాలా వెనకాడుతారు. భయపడతారు. ఇబ్బంది పడతారు. కానీ ఎందుకు అంత టెన్షన్. దేనికి మీరు మొహమాట పడుతున్నారు. ఈ సమస్య వల్ల మీరు మీ లైఫ్ ను కోల్పోవాల్సి వస్తుందని గుర్తించారా? ఇప్పటికీ అయినా మంచి పోయింది లేదు. లేదు, కాదు లు నేర్చుకోండి. కాస్త మీ లైఫ్ గురించి మీరు ఆలోచించండి.



# మోదీ రాకతో పాక్ పతనం
## చివరకు అడుక్కుతినే స్థాయికి!

2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశంలో రాజకీయంగా, ఆర్థికంగా అనేక కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఆయన మన దాయాది దేశం పాకిస్తాన్‌తో సంబంధాలు పునరుద్ధరించేందుకు యత్నించారు. 2015 డిసెంబర్‌లో పాకిస్తాన్ పర్యటనకు వెళ్లారు 2002 తర్వాత భారత ప్రధాని పాకిస్తాన్‌లో పర్యటించారు. అయితే పాకిస్తాన్ దీనిని అలుసుగా తీసుకుంది. ఇదే అదనుగా ఉగ్రమూకలను భారత్‌పైకి పంపింది. పేలుళ్లకు పాల్పడింది. పార్లమెంట్‌పై దాడికీ యత్నించింది. యూరి, పుల్వామా ఘటన తర్వాత పాకిస్తాన్‌పై మోదీ కఠిన నిర్ణయాలు తీసుకోవడం మొదలు పెట్టారు. భారత సైనికులను పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్‌ను అడుక్కుతినే స్థాయికి తెస్తానని ప్రకటించారు. అన్నట్లుగానే 2016లో పెద్దనోట్ల రద్దు ప్రభావం పాకిస్తాన్‌పై తీవ్రంగా పడింది. 2014 ముందు వరకు ఆర్థికంగా భారత్‌కన్నా మెరుగ్గా ఉన్న పాకిస్తాన్.. భారత కరెన్సీనే తమ దేశంలో చలామణి చేసింది. ఉగ్రవాదులకు మన కరెన్సీ ముద్రించి అందించింది. ఈ విషయం తెలిసినా అప్పటి పాలకులు చూసీచూడనట్లు ఉన్నారు. మోదీ వచ్చాక కథ మారిపోయింది..



### నోట్ల రద్దు ప్రభావం..

ఒక వాదన ఏమిటంటే, మోదీకి ముందు భారతీయ కరెన్సీ పాకిస్తాన్‌లో విస్తృతంగా చలామణి అవుతూ ఉండేది, నకిలీ నోట్లు ముద్రించబడి ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగపడేవి. వాస్తవానికి, పాకిస్తాన్ నుంచి నకిలీ భారతీయ కరెన్సీ సమస్య దశాబ్దాలుగా ఉంది. 2016 నోట్ల రద్దు ఈ నకిలీ నోట్లు, హవాలా వ్యవహారాలపై కొంత ప్రభావం చూపిందని భారత ప్రభుత్వం అధికారికంగా చెప్పింది. అయితే, పాకిస్తాన్‌లో భారతీయ కరెన్సీ అధికారికంగా చలామణి అయ్యేది కాదు, లేదా అది దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం కాదు. నోట్ల రద్దు పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చింది అనే వాదన అతిశయోక్తి. పాక్ ఆర్థిక సమస్యలు నిర్మాణాత్మకమైనవి. అధిక రుణాలు, తక్కువ ఎగుమతులు, శక్తి ఖర్చులు, రాజకీయ అస్థిరత, పెట్టుబడుల కొరత మరింత సమస్యగా మారాయి.

### ఆర్థిక అంతరం విస్తరణ

భారత్ యూనియన్ బడ్జెట్ గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. 2010ల ప్రారంభంలో 12 నుంచి 15 లక్షల కోట్ల స్థాయి నుంచి ఇప్పుడు 45 నుంచి 50 లక్షల కోట్లకు పైగా చేరుకుంది. ఇది ఆర్థిక విస్తరణ, పన్ను వసూళ్లు, అభివృద్ధి ఖర్చుల పెరుగుదలను సూచిస్తుంది. పాకిస్తాన్ మాజీ ఆర్థిక మంత్రి మిఫ్తా ఇస్మాయిల్ ఇటీవలి వ్యాఖ్యల్లో ఒక ముఖ్యమైన గణాంకాన్ని ప్రస్తావించారు. 2000లో పీపీపీ ఆధారంగా పాకిస్తాన్ తలసరి జీడీపీ భారత్ కంటే సుమారు 43 శాతం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు భారత్ తలసరి ఆదాయం పాకిస్తాన్ కంటే దాదాపు 94 శాతం ఎక్కువగా ఉంది. బంగ్లాదేశ్ కూడా పాకిస్తాన్‌ను అధిగమించింది. ఇది 26 సంవత్సరాల కాలంలో జరిగిన మార్పు. మిఫ్తా ఇస్మాయిల్ దీనికి కారణంగా నిరంతర పాలనా వైఫల్యాలు, రుణ పెరుగుదల, తక్కువ పెట్టుబడులు, విద్యా వెనుకబాటు, ఎగుమతుల స్తబ్దతను ప్రస్తావించారు. వివిధ ప్రభుత్వాలు (సైనిక, పౌర, హైబ్రిడ్) వచ్చినా పురోగతి లేదని అభిప్రాయ పడ్డారు.

### సంబంధాల మార్పు ప్రభావం

మోదీ పాలనలో భారత్ పాకిస్తాన్‌పై ఆర్థిక, దౌత్య ఒత్తిడిని పెంచింది. సార్క్ సమ్మిట్ బహిష్కరణ, వాణిజ్య పరిమితులు, అంతర్జాతీయ వేదికలపై టెర్రరిజం వ్యతిరేక ప్రచారం ఇందులో భాగం. భారత్ ఆర్థిక శక్తి పెరుగుతున్న కొద్దీ ఈ వైఖరికి అవకాశం ఏర్పడింది. పాకిస్తాన్‌లో రాజకీయ అస్థిరత, అప్పుల భారం, విదేశీ పెట్టుబడుల కొరత ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మొత్తంగా చూస్తే, 2014 తర్వాత భారత్, పాకిస్తాన్ సంబంధాల్లో స్పష్టమైన మార్పు వచ్చింది. భారత్ ఆర్థికంగా వేగంగా ముందుకు సాగుతున్నప్పుడు, పాకిస్తాన్ తన అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో వెనుకబడింది. నకిలీ కరెన్సీ, నోట్ల రద్దు లాంటి అంశాలు కొంత ప్రభావం చూపినా, పాకిస్తాన్ ఆర్థిక పతనానికి ప్రధాన కారణాలు దీర్ఘకాలిక నిర్మాణాత్మక సమస్యలు.

**మోదీ వచ్చాక పాక్‌లో ఆర్థిక సంక్షోభం..**

మోదీ ప్రధాని అయ్యే ముందు, భారత్–పాకిస్తాన్ సంబంధాలు ఒక రకమైన సంక్లిష్టతలో ఉండేవి. డైలాగ్, వాణిజ్యం, క్రికెట్ లాంటి అంశాల్లో కొంత సాధ్యమైన సంభాషణ ఉండేది. 2014 తర్వాత ఈ సమీకరణం మారింది. ''టెర్రరిజం, చర్చలు కలిసి సాగవు'' అనే వైఖరి బలపడింది. యూరి, పుల్వామా లాంటి ఘటనల తర్వాత భారత వైఖరి మరింత దృఢంగా మారింది. ఇది రెండు దేశాల మధ్య రాజకీయ, దౌత్య సం బంధాల్లో స్పష్టమైన తేడాను తెచ్చింది.

# నీటి ఎక్స్‌పైరీ డేట్?



ఒక రోజు పాత నీటిని కొందరు పార బోస్తారు.. ఒక వారం పాత నీటిని మరికొందరు తాగుతారు. కానీ వేల సంవత్సరాల క్రితం భూమిలో నిల్వైన నీటిని మాత్రం మనం అత్యంత స్వచ్ఛమైనదిగా భావిస్తాం! అయితే అసలు నీటి ఎక్స్‌పైరీ డేట్ ఎంత? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకుంటే. నీటి గురించి మీ ఆలోచనే మారిపోవచ్చు.

చాలాసార్లు మనం మన సౌకర్యాన్ని బట్టి, మన ఆలోచనా విధానాన్ని బట్టి నీటికి ఒక "ఎక్స్‌పైరీ డేట్" నిర్ణయించేస్తుంటాం. కానీ నిజానికి దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారమూ లేదు. ఒకసారి మన చుట్టూ జరుగుతున్న ఈ పరిస్థితులను గమనించండి

### నగరాల్లో:

ఎక్కడైతే ప్రతిరోజూ మున్సిపల్ పంపుల్లో నీళ్లు వస్తాయో, అక్కడ నిన్నటి నీటిని "పాసిపోయాయి" అనుకుంటూ పారబోసేస్తారు.
(వీరి లెక్కలో ఎక్స్‌పైరీ డేట్: కేవలం 1 రోజు)
నీళ్లు వారానికి ఒకసారే వచ్చే ప్రాంతాల్లో:
అదే నీరు రెండు నుండి ఎనిమిది రోజుల పాటు అచ్చం ఫ్రెష్‌గా, తాగడానికి వీలుగానే ఉంటుంది. ఎవరూ పారబోయరు.
(వీరి లెక్కలో ఎక్స్‌పైరీ డేట్: 2 నుండి 8 రోజులు)

### పెళ్లిళ్లు, శుభకార్యాల్లో

టేబుల్ మీద కొత్త బిస్లరీ బాటిల్ ఓపెన్ చేయగానే, పక్కనే ఉన్న పాత బాటిల్‌ను పనికిరానిదిగా చూస్తూ అక్కడే వదిలేస్తారు లేదా పారేస్తారు.
(వీరి లెక్కలో ఎక్స్‌పైరీ డేట్: కొన్ని నిమిషాలు లేదా గంటలు మాత్రమే) కానీ అసలు నిజం ఇంకోలా ఉంది.

### ఎడారిలో:

ప్రయాణం చేసేటప్పుడు, తదుపరి నీటి వనరు దొరికే వరకు ప్రతి ఒక్క నీటి చుక్కా ఎంతో విలువైనదిగా, ఫ్రెష్‌గానే ఉంటుంది.
(ఎక్స్‌పైరీ డేట్: ఇంకో నీటి వనరు దొరికేంత వరకు)

### ప్రకృతిలో

డ్యామ్‌లలో, చెరువుల్లో నిల్వ ఉండే నీరు తదుపరి వర్షాకాలం వచ్చే వరకు, కొన్ని సార్లు కరవు కాలంలో 2–3 ఏళ్ల వరకు కూడా వాడుకలోనే ఉంటుంది.
(ఎక్స్‌పైరీ డేట్: కొన్ని సంవత్సరాలు)

### బోరు బావుల్లో

మనం భూమి లోపల 50 నుండి 500 అడుగుల లోతు నుండి తోడే నీరు వందల, వేల సంవత్సరాల నాటిది కావచ్చు. అయినా సరే, అదే నీటిని మనం అత్యంత సురక్షితమైనదిగా, ఆరోగ్యకరమైనదిగా భావిస్తాం.
(ఎక్స్‌పైరీ డేట్: వందల, వేల సంవత్సరాలు.. బహుశా ఎప్పటికీ అవ్వదు)

### ముగింపు

**(ఆలోచించాల్సిన విషయం)**

నిజానికి నీటికి ఎటువంటి ఎక్స్‌పైరీ డేట్ ఉండదు. దాని కాలపరిమితిని నిర్ణయించేది కేవలం మన ఆలోచన, అది మనకు దొరికే లభ్యత, మరియు దాని పరిశుభ్రత మాత్రమే. నీరు సులభంగా దొరికినప్పుడు దాన్ని 'పాసిపోయింది' అంటాం; అదే కరవు వచ్చినప్పుడు ఆ నీరే అమృతంతో సమానమైపోతుంది.
అందుకే, నీటిని ఎంతో బాధ్యతగా, పొదుపుగా వాడుకుందాం. లేకపోతే, ప్రకృతిలో నీరు అయిపోవడానికి ముందే, మన అజాగ్రత్త మనల్ని దాహంతో అలమటించేలా చేస్తుంది.

### ఒక చిన్న విన్నపం

ఇది కేవలం ఒక మెసేజ్ మాత్రమే కాదు, మన భవిష్యత్తును కాపాడుకోవడానికి ఒక పిలుపు. నీటి విలువను అందరికీ తెలియజేయడానికి ఈ విషయాన్ని మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో గ్రూప్స్‌లో షేర్ చేయండి.

**నీరే ప్రాణాధారం**
**నీరు ఉంటేనే.. మనకు రేపు ఉంటుంది**

**ఆరోగ్యంగా ఉండండి.. సురక్షితంగా ఉండండి.. నీటిని పొదుపు చేయండి..**

# ఆకు కూరలను ఇలా తినాలి




మీరు రోజు కూరగాయలు తింటారా? మరి తినాల్సిందే కదా. రోజు వంట చేయాల్సిందే కదా. రోజు రెండు సార్లు వంట చేస్తారా? రైస్ చేయకున్నా చపాతీలోకి కూడా కర్రీ ఉండాలి. అంటే కూరలు వండాలి. మరి ఆకు కూరలా? కూరగాయలా? అయితే ఆకుకూరలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అందువల్ల, అందరూ తమ ఆహారంలో ఆకుకూరలను చేర్చుకోవాలి. అయితే ప్రతి రోజు కూరగాయలు తింటారు చాలా మంది. వారంలో ఒకసారి లేదా అప్పుడప్పుడు మాత్రమే ఆకు కూరలను వండుతారు. కానీ కూరగాయల కంటే కూడా ఆకుకూరలు చాలా బెటర్ అంటున్నారు నిపుణులు. ఏ సీజన్ లో అయినా సరే వీటిని తినవచ్చు. అంటే ప్రతి సీజన్‌లో ఆకుకూరలు తినాలి. ఇక శీతాకాలంలో ఆకుకూరలు సులభంగా లభిస్తాయి. శీతాకాలంలో వాటిని తీసుకోవడం కూడా ప్రయోజనకరం. ఇప్పుడు వర్షాకాలం కదా. ఈ సమయంలో కూడా బాగానే ఉంటాయి.

ఆకుకూరలు తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. శరీరం అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. మీరు మీ శీతాకాలపు ఆహారంలో ఆకుకూరలను కూడా చేర్చుకోవాలి. ఎందుకంటే ఇందులో కాల్షియం, ఐరన్ ఉంటాయి. ఇవి కూరగాయల్లో లభించేకంటే మూడు నుంచి 4 రెట్లు ఎక్కువగా ఆకుకూరల్లో లభిస్తాయి. అంతేకాదు శరీరానికి కావాల్సిన లవణాలు కూడా ఈ ఆకుకూరల్లో లభిస్తాయి. సోడియం, పొటాషియం, మెగ్నీషియం కూడా పుష్కలంగా లభిస్తాయి. కూరగాయల్లో కంటే ఇవి ఆకుకూరల్లోనే 3 నుంచి నాలుగు రెట్లు ఎక్కువ ఉంటాయి.
ఇందులో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువే ఉంటాయి. అంతేకాదు నూనె, మసాలా వంటివి కూడా ఈ ఆకుకూరల వల్ల సేవ్ అవుతాయి. ఈ ఆకుకూరలకు మసాలా, నూనె వంటివి చాలా తక్కువ అవసరం. ఇందులో మసాలా అసలు వేయరు. కొందరు వంకాయ, ఆలు, దొండకాయ, బీరకాయ వంటివి కూడా మసాలా చేసి చేస్తుంటారు. రుచి బాగుంటుంది కానీ ఆరోగ్యం కూడా మస్ట్ కదా. సో ఈ ఆకుకూరలకు మాసాలా పెట్టాలనే ఆలోచన కూడా ఉండదు. అందుకే కూరగాయల కంటే కూడా ఆకుకూరలు ఎక్కువ తినడం బెటర్ అంటున్నారు నిపుణులు.
కొన్ని ఆకుకూరల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, రాగి, మాంగనీస్, కాల్షియం వంటివి పుష్కలంగా లభిస్తాయి. మీరు అలాంటివి తింటే జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలను తొలగించుకోవచ్చు. కాల్షియం, మెగ్నీషియంలు ఎముకలను బలంగా చేస్తాయి. వీటి వల్ల కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు ఇందులో విటమిన్ సి ఉంటుంది. శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 22.08.2026
www.mudranews.in | @mudranews



**చమట దుర్వాసన నివారణకు**



నీరు ఎక్కువగా తాగాలి:శరీరంలో నీటి సమ తుల్యతను కాపాడేందుకు తగినంత నీరు తాగడం, అధిక మసాలా ఆహారం వంటి చెమటను పెంచే పదార్థాలను తగ్గించడం ఉపయోగకరం.

# ఖేలో ఇండియా పథకం క్రీడా రంగ స్వరూపాన్నే మారుస్తుంది

**ఒలింపియన్ జ్వాలా గుట్టా ‘ఖేలో ఇండియా’ పునరుద్ధరించిన పథకానికి మద్దతు**
**‘ఇది ఎప్పుడో రావాల్సిన గేమ్‌చేంజర్ ప్రాజెక్ట్’**



**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 21:** రెండుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, మాజీ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పతక విజేత జ్వాలా గుట్టా, పునరుద్దరించిన ఖేలో ఇండియా పథకం భారత క్రీడా రంగ స్వరూపాన్నే మార్చే సామర్థ్యం కలిగి ఉందని అన్నారు. ఈ పథకం ఒక “గేమ్‌చేంజర్” అని, ఇది ఎప్పుడో రావాల్సిన కార్యక్రమమని పేర్కొన్నారు.2026–31 కాలానికి అమలు చేయనున్న ఈ పథకానికి రూ.29,054 కోట్ల కేటాయింపు చేశారు. ఇది గత కేటాయింపుతో పోలిస్తే సుమారు 8 రెట్లు అధికం. అలాగే పథకం ద్వారా సహాయం పొందే క్రీడాకారుల సంఖ్యను 10 రెట్లు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.మీడియా సమావేశంలో జ్వాలా గుట్టాతో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బెంగళూరు ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ విష్ణు సుధాకరన్, ఢిల్లీకి చెందిన SAI డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి ఎస్. హిమ బిందు పాల్గొన్నారు.హిమ బిందు మాట్లాడుతూ, క్రీడాకారులను గ్రాస్‌రూట్ స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయి వరకు తీర్చిదిద్దే మార్గాన్ని ఈ పథకం సమగ్రంగా రూపొందించిందన్నారు. కోచ్‌ల బోర్డు ఏర్పాటు, అకాడమీ వ్యవస్థ బలోపేతం, మౌలిక సదుపాయాలు, స్పోర్ట్స్ టెక్నాలజీకి నిధులు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.తెలంగాణకు ప్రత్యేక ప్రయోజనాలుతెలంగాణలో ఇప్పటికే 33 ఖేలో ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటిలో మాజీ ఛాంపియన్ క్రీడాకారుల (PCA) ఆధ్వర్యంలో 601 మందికి పైగా క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు.మేడ్చల్–మల్కాజ్‌గిరిలో ఒక ఖేలో ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనిచేస్తోంది. ఇందులో రోయింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడల్లో 254 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. వీరిలో 152 మంది పురుషులు, 102 మంది మహిళలు ఉన్నారు.రాష్ట్రంలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, సైక్లింగ్, టెన్నిస్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు సంబంధించి 19 ఖేలో ఇండియా గుర్తింపు పొందిన అకాడమీలు ఉన్నాయి.మహిళల కోసం నిర్వహిస్తున్న ASMITA లీగ్‌లలో 20,921 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు 127 ASMITA లీగ్‌లు నిర్వహించారు.జ్వాలా గుట్టా మాట్లాడుతూ, ప్రభుత్వ సహకారం వల్లే తాను క్రీడా కారిణిగా ఎదగగలిగానని చెప్పారు. కొత్త రూపంలో ఖేలో ఇండియా పథకం ఎంతో ఆశాజనకంగా ఉందన్నారు. గ్రాస్‌రూట్ స్థాయి అభివృద్ధి, క్రీడల్లో నిలకడపై దృష్టి పెట్టడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపేందుకు మరింత భద్రతగా భావిస్తారని పేర్కొన్నారు.ఈ పథకంలో శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రతిభ గుర్తింపు వ్యవస్థను ఏర్పాటు చేయడం కీలక అంశంగా ఉంది. ఇందులో ఖేలో ఇండియా ఉత్తమ విద్యాలయాలు, ఫీడర్ స్కూళ్లు, ఖేలో ఇండియా కేంద్రాలు కీలక పాత్ర పోషించనున్నాయి.అలాగే Khelo India Athletes (KIA), Emerging Khelo India Athletes (E-KIA) పేర్లతో క్రీడాకారులను గుర్తించి అభివృద్ధి చేసే విధానం రూపొందించనున్నారు.కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం కూడా పథకంలో ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా ఈ ఏడాది చివర్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది.పథకంలో కేంద్ర–రాష్ట్ర సహకారంతో కూడిన విధానాన్ని ప్రతిపాదించారు. ప్రతిభ అభివృద్ధి, క్రీడాకారుల కొనసాగింపు, గ్రాస్‌రూట్ నుంచి ఎలైట్ స్థాయికి మార్పు, సంస్కరణల ఆధారిత లక్ష్యాల సాధనకు అనుగుణంగా నిధుల కేటాయింపు ఉండనుంది.డాక్టర్ సోనిబాలా దేవి మాట్లాడుతూ, ఈ పథకం తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. క్రీడలను విద్యా విధానంతో అనుసంధానం చేయడం వల్ల భవిష్యత్తులో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు.SAI ప్రాంతీయ డైరెక్టర్ విష్ణు సుధాకరన్ మాట్లాడుతూ, ఖేలో ఇండియా పథకానికి సంబంధించిన పూర్తి కార్యాచరణ మార్గదర్శకాలు ఇంకా రూపొందుతున్నాయని తెలిపారు. గతంలో పరిమిత బడ్జెట్‌తో కొన్ని అంశాలపై మాత్రమే దృష్టి పెట్టేవారని, ప్రస్తుతం భాగస్వామ్య పక్షాలతో విస్తృత చర్చల అనంతరం రూపొందించిన ఈ పథకం అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న ‘ఖేలో భారత్’ లక్ష్యానికి అనుగుణంగా క్రీడలను దేశంలోని సామాన్య ప్రజల వరకు తీసుకెళ్లేందుకు ఈ పథకం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# జీవో 150తో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం

**వెంటనే సవరణ చేయాలి**
**సీఎం స్పందించాలి**
**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



**ముద్ర, హైదరాబాద్:** జీవో నంబర్ 150 కారణంగా నీట్ రాసిన తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవోను పునః పరిశీలించి, తెలంగాణ విద్యార్థులకు నష్టం జరగకుండా తగిన సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ఈ అంశంపై తక్షణమే స్పందించాలని కోరారు.నీట్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం బంజారాహిల్స్‌లో కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. జీవో 150 వల్ల ఎదు రవుతున్న ఇబ్బందులు, మెడికల్ సీట్ల విషయంలో తమకు జరుగుతున్న నష్టాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 150తో నీట్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికే విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారని తెలిపారు. కేవలం నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వారిని స్థానికులుగా పరిగణించేలా నిబంధనలు తీసుకురావడం వల్ల తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతుందని విమర్శించారు.తెలంగాణ భవిష్యత్ తరాలకు న్యాయం చేయడానికే రాష్ట్రాన్ని సాధించుకున్నామని ప్రభుత్వం గుర్తించాలని కవిత అన్నారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో రాష్ట్ర విద్యార్థులకు తగిన ప్రాధాన్యత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జీవో 150 కారణంగా మెడిసిన్‌లో సుమారు 1,600 సీట్లు ఇతర ప్రాంతాల విద్యార్థులకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.జీవో 150ను వెంటనే రద్దు చేయడం సాధ్యం కాకపోతే, అనుబంధ ఉత్తర్వులు జారీ చేసి నిబంధనలను సవరించాలని కవిత డిమాండ్ చేశారు. కనీసం ఏడేళ్ల పాటు తెలంగాణలో చదివిన విద్యార్థులను మాత్రమే స్థానికులుగా పరిగణించేలా చర్యలు తీసుకో వాలని సూచించారు.ఇప్పటికే నీట్ విధానం వల్ల తెలంగాణకు 15 శాతం సీట్లు కోల్పోతున్నామని కవిత అన్నారు. రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన తరఫున నీట్ విధానాన్ని వ్యతిరేకిస్తు న్నామని తెలిపారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకంగా మెడికల్ ప్రవేశ వ్యవస్థ ఉంటేనే స్థానిక విద్యార్థులకు న్యాయం జరు గుతుందని అభిప్రాయపడ్డారు.ఇది అత్యంత సమయ స్ఫూర్తితో పరిష్కరించాల్సిన అంశమని కవిత స్పష్టం చేశారు. వారం రోజుల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే సుమారు 1,500 మంది విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యమంత్రి విదేశాల్లో ఉన్నప్పటికీ ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని కోరారు. ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు తక్షణమే సమావేశమై జీవో 150పై నిర్ణయం తీసుకుని తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## పోలీస్ క్రీడా పోటీలను ప్రారంభించిన సీపీ



**ముద్ర, గోదావరిఖని:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని ఆర్‌సీఓ క్లబ్‌లో నిర్వహిస్తున్న 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026 క్లస్టర్–C కాళేశ్వరం జోన్ పోలీస్ క్రీడా పోటీలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో ఓపెన్ కేటగిరీతో పాటు 18–30, 40+ మరియు 50+ వయస్సు కేటగిరీల్లో పోటీలు నిర్వహి స్తున్నారు. కాళేశ్వరం జోన్ పరిధిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన పోలీస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటు న్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో కాళేశ్వరం జోన్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.ఈ సం దర్భంగా సీపీ మాట్లాడుతూ, టీమ్‌వర్క్, పరస్పర సహకారం,నిరంతర సాధనతో పాటు తమ లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడం ద్వారా విజయాలు సాధించవచ్చని అన్నారు.పోలీస్ విధుల్లో శారీరక దారుఢ్యం తో పాటు క్రమశిక్షణ, సమన్వ యం, జట్టు స్ఫూర్తి ఎంతో ముఖ్య మని పేర్కొన్నారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వ యం,జట్టు భావన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రతి పోలీస్ అధికారి,సిబ్బంది క్రీడాస్ఫూర్తిని అల వర్చుకుని పరస్పర విశ్వాసంతో సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు.క్రీడల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం, అవ సరమైన మద్దతు అందిస్తామని సీపీ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ–అడ్మిన్ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్‌ఐలు దామోదర్, పెద్దన్న,రమేష్, మల్లేశం, ఆర్‌ఎస్‌ఐలు వెంకట్,శివ పాల్గొన్నారు.

# తాగునీటికి శాశ్వత పరిష్కారం

**11 ఓవర్ హెడ్ ట్యాంక్‌లతో 18 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం**
**త్వరలో రూ.600 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**
**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** నగర ప్రజల ప్రస్తుత, భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహబూబ్‌నగర్‌లో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.220 కోట్లతో అదనంగా 18 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నగరంలో 20 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, పెరుగుతున్న అవ సరాలకు అది సరిపోవడం లేదన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, పంపింగ్ సామర్థ్యం తగ్గడం, నీటి సరఫరాలో అంతరాయాలు వంటి కారణాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతోందని చెప్పారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అదనంగా 18 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు, ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వా యర్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూముల్లో ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉండటంతో అక్కడక్కడా ఎదుర వుతున్న భూ సంబంధిత సమస్యలను పరి ష్కరించుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పంపింగ్‌లో ఒకరోజు ఆలస్యం జరిగినా ముందుగానే నీటిని నిల్వ చేసుకుని ప్రజలకు సరఫరా చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా మారిన నేపథ్యంలో నగర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు.

**రూ.600 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ**

రూ.600 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించు కున్నామని, రాబోయే వారం, పది రోజుల్లో ఒక్కో కాలనీ, ఒక్కో డివిజన్ లో దశలవారీగా పనులకు శంకుస్థాపన లు ప్రారంభిస్తామని చెప్పారు. రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో అండ ర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

## సంగం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు శ్రీకారం




ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్: ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం త్రివేణి సంగం బ్రిడ్జి వద్ద నూతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ట్రాఫిక్ ఏసిపి ధనలక్ష్మి , ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్ లు అన్నారు. శంకర్పల్లి, సన్ సిటీ వైపు నుండి వచ్చే వాహనదారులు అత్తాపూర్, బహదూర్పురా , రాజేంద్రనగర్ వైపు వెళ్లే వాహనాలతో బాపు ఘాట్ వద్ద నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. సమస్య పరిష్కారానికై వాహనాలను దారి మళ్లించేందుకు పోలీసు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆరు నెలల క్రితం జోనల్ కమిషనర్ తో పాటు వివిధ శాఖల అధికారులకు సమస్యను చూపించి ట్రాఫిక్ పోలీసులు అనుమతి తీసుకున్నారు. మొదలు ప్రయోగాత్మకంగా వాహనాల మళ్లింపు చేసి చూడాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఏసీబీ ధనలక్ష్మి మాట్లాడుతూ.... గత ఆరు నెలలుగా బాపుగాటు వద్దకు వెళ్లకుండా సంగం బ్రిడ్జి వద్ద నుండే రోజుకు ఆరు గంటలపాటు మళ్ళించి చూసామన్నారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో అని శాఖల అధికారుల అనుమతితో ఇక్కడ శాశ్వతంగా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇక్కడ రెండు ఫ్రీ లెఫ్ట్ కూడా ఉంటుందని ఆమె అన్నారు. దీంతో త్రివేణి సంగం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద డివైడర్లను కూల్చివేసి, స్తంభాలను తొలగించి సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## ఘనంగా కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



**ముద్ర, చేవెళ్ల :** మొయినాబాద్ మాజీ జడ్పీటీసీ, ఎమ్మెల్యే యాదయ్య తనయుడు కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకలు శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గ కేంద్రం లో ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల, శంకర్ పల్లి పురపాలిక, మండలాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలదండాలు వేసి శాలువా లతో సన్మానం చేశారు. కేక్ కొయంచారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి పేదలకు సేవలు అందించాలని కోరుకున్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నాయకులు వెంకట్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ఆగిరెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, చంద్రమౌళి, శ్రీనివాస్ గౌడ్, బొల్లారం వెంకట్ రెడ్డి, ప్రభాకర్, కార్తీక్ తదితరులు ఉన్నారు

## సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్ పర్సన్ సుజాతకు పలువురు నివాళి



**ముద్ర, శేరిలింగంపల్లి:** తెలంగాణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్పర్సన్ కీ.శే. రాగం సుజాత యాదవ్ దశదినకర్మ సందర్భంగా పలువురు నివాళి అర్పించారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని నివాసంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. పిఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ ఎంపీ, బీసీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ అడ్వైసర్ వి.హన్మంత్ రావు, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భిక్షపతి యాదవ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్, శేరిలింగంపల్లి బీజెపి కంటస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ తదితరులు నివాళఇ అర్పించి ఆమె భర్త రాగం నాగేందర్ యాదవ్ తో పాటు అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దశ దిన కర్మ కార్యక్రమంల రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బైక్‌పై వెళ్తున్న యువకులపై గేదెల దాడి.. ఒకరు మృతి

**ముద్ర, మెదక్:** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం అంతారం గేటు వద్ద అత్యంత దారుణమైన మరియు విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. రహదారిపై ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులపై గేదెలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు.

**కొమ్ముల్లో ఇరుక్కుపోయిన దుర్గాప్రసాద్ తల**

పోలీసులు మరియు స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం. కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ (18) తన స్నేహితుడితో కలిసి నర్సాపూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అంతారం గేటు సమీపిస్తుండగా ఎదురొచ్చిన గేదెలు వారిపై విరుచుకుపడ్డాయి. అందులోని ఒక గేదె తన పదునైన కొమ్ములతో దుర్గాప్రసాద్‌ను అత్యంత బలంగా పొడవడంతో, కొమ్ము అతని తలలోకి చొచ్చుకుపోయింది. దాడి తీవ్రతకు దుర్గాప్రసాద్ గేదె కొమ్ముల్లోనే ఇరుక్కుపోయి తీవ్ర రక్తస్రావంతో క్షణాల్లో ప్రాణాలు విడిచాడు. మృతదేహాన్ని కొమ్ముల నుంచి వేరు చేసేందుకు పోలీసులకు గంటకు పైగా సమయం పట్టింది.

మరొకరి పరిస్థితి విషమం..

ఈ ఘోర ప్రమాదంలో దుర్గాప్రసాద్ స్నేహితుడు తీవ్రంగా గాయపడటంతో అతడిని వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది.

### చమట దుర్వాసనకు దుస్తులు తరచూ మార్చాలి

చెమటతో తడిసిన దుస్తులను ఎక్కువసేపు ధరించకుండా వెంటనే మార్చాలి. టవల్స్, దుస్తులను శుభ్రంగా ఉంచడం కూడా ముఖ్యం.



## ఇందుర్తి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి...

**ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొట్ల కార్తీక్.**



**ముద్ర చిగురుమామిడి :** ఇందుర్తి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై పంచా యతీ రాజ్ శాఖ ఉన్నతాధికా రులు విచారణ చేపట్టి నిధుల దుర్వినియోగం చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొట్ల కార్తీక్ అన్నారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామ ఉప సర్పంచ్ అనిల్ ను శుక్రవారం ఇందుర్తిలో అధ్యక్షుడు కార్తీక్,రాష్ట్ర కమిటీ సభ్యులు కలిసి మనోధైర్యాన్ని కలిగించారు.ఇందుర్తి గ్రామ పంచాయతీలో జరుగుతున్న నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్,పంచాయతీ రాజ్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు సకాలంలో విచారణ చేపట్టి సంబంధిత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ నిధుల మంజూరు విషయంలో ఉప సర్పంచ్ అనిల్ ను సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి ఒత్తిడికి గురి చేస్తూ అధిక నిధుల మంజూరు బిల్లులపై సంతకాలు చేయిస్తున్నారని,నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించిన ఉప సర్పంచ్ అనిల్ ను గ్రామ పాలక కార్యవర్గంతో ఒత్తిడి తెస్తున్నారని అన్నారు.గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం,అధిక బిల్లుల చెల్లింపులు వంటికి ఆధారాలు ఉన్నాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పరిశీలించి విచారణ చేయించాలని కోరారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ అనిల్ కు ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉప సర్పంచులు రాష్ట్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో దొంగతనం

**- రూ.12 వేల నగదు, బంగారం అపహరణ**



**ముద్ర చిగురుమామిడి :** తాళం వేసి ఉన్న ఇంటినే లక్ష్యంగా చేసుకుని దొంగలు తమ చేతివాటం ప్రదర్శించిన సంఘటన కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. తాళం వేసి బంధువుల ఊరు వెళ్లిన సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించారు.బాధితుడు సూరం ప్రతాపరెడ్డి వెల్లడించిన కథనం ప్రకారం.. దాదాపు పది రోజుల కిందట కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారు. అయితే శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉన్నట్లు గమనించిన పొరుగింటి వారు ప్రతాపరెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వెంటనే చేరుకుని చూడగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు స్పష్టమైంది. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. కరీంనగర్ జిల్లా క్లూస్ టీమ్ రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. సుమారు 3 తులాల బంగారం, బంగారు చెవికమ్మలు, 5 తులాల వెండి వస్తువులతో పాటు రూ.12 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దుండగుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు.

## రెవెన్యూ అధికారులపై కొరడా.. తహసీల్దార్ సస్పెన్షన్‌కు ఆదేశం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెవెన్యూ, హౌసింగ్‌పై మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష సమీక్ష**



**ముద్ర, కరీంనగర్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అవినీతి, విధుల్లో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులతో మంత్రి సుమారు నాలుగు గంటల పాటు సమీక్ష నిర్వహించారు.విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. మరికొందరు అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఇకపై రెవెన్యూ, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, తప్పులు దొర్లితే ఎవరినీ ఉపేక్షించబోనని హెచ్చరించారు.ఇందిరమ్మ ఇళ్లు, భూ రీ సర్వే, 22-ఏ కేసులు, భూ భారతి దరఖాస్తులు, అసైన్డ్ భూముల సమస్యలపై జిల్లాల వారీగా సమీక్షించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు ప్రజలతో గౌరవంగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు.భూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలని, ఇందిరమ్మ ఇళ్లలో పెండింగ్ సమస్యలను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. 22-ఏ, అసైన్డ్ భూముల కేసులను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖపై ఉన్న అవినీతి మచ్చను తొలగించేలా అధికారులు పనిచేయాలని, అవినీతి ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.ఈ సమీక్ష ప్రారంభం మాత్రమేనని, ఇకపై అధికారుల పనితీరు, కార్యాలయాల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని పొంగులేటి స్పష్టం చేశారు.

# భూ బాధితులకు న్యాయం చేయండి

**22ఏ భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలి..**
**మంత్రి పొంగులేటికి వెలిచాల రాజేందర్‌రావు విజ్ఞప్తి**
**సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి**
**తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కరీంనగర్ కలెక్టర్ కు ఆదేశం..**
**ఇప్పటికే రెండుసార్లు కలెక్టర్ తో మాట్లాడిన వెలిచాల**
**సమస్యపై దృష్టి పెట్టిన జిల్లా కలెక్టర్..**
**బాధితులు ఎలాంటి ఆందోళన చెందవద్దు : వెలిచాల రాజేందర్ రావు**



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్లో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూముల బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం జగిత్యాలలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లోని కొత్తపల్లి, రేకుర్తి, విద్యానగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు 22ఏ నిషేధిత జాబితా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజేందర్ రావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రిజిస్ట్రేషన్లు జరిగిన భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో వాటి క్రయవిక్రయాలు నిలిచిపోయాయని తెలిపారు.

ఈ భూముల్లో ఎక్కువగా చిన్న, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఉన్నారని, చాలామంది ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని వివరించారు. ఇంటిపన్నులు చెల్లిస్తూ, గృహ నిర్మాణ రుణాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తోందన్నారు.

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల్లో 22ఏ నిషేధిత జాబితా కారణంగా వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారని రాజేందర్‌రావు తెలిపారు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం రేకుర్తి ప్రాంతంలో సుమారు 125 సర్వే నంబర్ల పరిధిలో 555 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని, ఈ భూముల్లో సుమారు 3 వేల ఇళ్లు, 6 వేల ప్లాట్లు ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.విద్యానగర్‌కు సంబంధించిన కొన్ని సర్వే నంబర్లలో సుమారు 536 ఎకరాలు, మరో 16 సర్వే నంబర్లలో 115 ఎకరాలు, అలాగే కొత్తపల్లి ప్రాంతంలోని మరికొన్ని పట్టా భూములు 22ఏ జాబితాలో చేరడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని ఆయన వివరించారు. మొత్తం 230 సర్వే నెంబర్లలో 1000 ఎకరాలకు పైగా భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

విద్య, వైద్యం, వివాహాలు, కుటుంబ అవసరాల కోసం తమ భూములను విక్రయించుకోవాల్సిన పరిస్థితుల్లో ఉన్న బాధితులు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వివాదాలు, కోర్టు కేసులు లేని అర్హత కలిగిన పట్టా భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి 22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరారు.

**మంత్రి సానుకూల స్పందన**

రాజేందర్‌రావు విజ్ఞప్తిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. 22ఏ భూముల సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు రాజేందర్‌రావు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల అనంతరం రాజేందర్‌రావు కరీంనగర్ కలెక్టర్‌తో రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కలెక్టర్ సైతం చొరవ చూపుతున్నారని తెలిపారు. "నిషేధిత భూముల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు న్యాయం జరిగే వరకు వారి తరపున పోరాడుతాను. మంత్రి సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ కూడా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. అర్హత ఉన్న భూముల విషయంలో త్వరలోనే మంచి నిర్ణయం వస్తుంది. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు.

## నేనే ఓడిపోతామా గవర్నమెంట్ పోతది

**మంత్రి వివేక్ వ్యాఖ్యలపై తెలంగాణలో చర్చ**

**ముద్ర, హైదరాబాద్:** పాలిటెక్నిక్ విద్యార్థులతో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్కిల్ వర్సిటీ నుంచి ఇన్వెస్టర్లు వెనక్కి వెళ్లరని గ్యారెంటీ ఇవ్వాలని విద్యార్థులు కోరగా.. "రేపు నేనే ఓడిపోతానేమో.. మా ప్రభుత్వమే దిగిపోతుందేమో.. నేను గ్యారెంటీ ఇస్తే మీకేం ఫాయిదా" అంటూ మంత్రి స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చర్చకు దారితీశాయి. సొంత పార్టీ నేతల వ్యాఖ్యలతో తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ అధిష్ఠానానికి వివేక్ వ్యాఖ్యలు మరో షాక్‌గా మారాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## సీఎం వచ్చాక మాట్లాడతా: కొండా సురేఖ

**ముద్ర, హైదరాబాద్ :** సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను"అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యల్లో డొల్లతనం

**- రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**
**- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎక్కడ అమలవుతుందో చెప్పాలి : బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**
**-12 ఏళ్ల బీజేపీ పాలనలో 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది? : వైద్యుల అంజన్ కుమార్**
**- కరీంనగర్ ఆర్.ఓ.బీ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి : కార్పొరేషన్ కాంగ్రెస్ డిమాండ్**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని మున్నూరు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. కరీంనగర్‌లోని తన నివాసంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రెహమత్ హుస్సేన్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కరీంనగర్ పర్యటనలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా, డొల్లతనంగా ఉన్నాయని విమర్శించారు. పేద, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తుకు విద్యే ఏకైక మార్గమని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.2,400 కోట్లు కేటాయించి, రూ.2,050 కోట్లను తక్షణమే విడుదల చేసిందని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్లకు చేరాయని, అర్హతలు, నిధుల వినియోగంపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రైతుబంధు తరహాలో విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా నిధులు జమ చేసే విధానాన్ని తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయకుండా, పరీక్షలు పూర్తైన వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన గొప్ప పథకంగా అభివర్ణించారు. విమర్శలు చేస్తున్న బీజేపీ నేతలు ముందుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకం ఎక్కడ అమలవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, విద్యార్థులకు జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. NTA వైఫల్యాలపై కేంద్రం సమాధానం చెప్పాలని, రాజకీయ ఉనికి కోసం విద్యార్థులను ఉపయోగించుకోవద్దని హితవు పలికారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ 12 ఏళ్లుగా అధికారంలో ఉన్నా ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రానికి వస్తున్న నిధులు, సెంట్రల్ జీఎస్టీ ద్వారా వెళ్తున్న నిధుల విషయంలో కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

అమృత్ పథకం కింద నిధుల వరద తెస్తామని చెప్పిన కేంద్ర మంత్రి ఇప్పటివరకు ఎన్ని నిధులు తీసుకొచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. పాత పథకాలకు పేర్లు మార్చి స్మార్ట్ సిటీ నిధులుగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కరీంనగర్ ఆర్‌ఓబీ నిర్మాణం ఏడాది గడిచినా పూర్తికాకపోవడంతో రోగులు, అంబులెన్స్‌లు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర నిధుల పేరుతో ఆరోపణలు చేయకుండా బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పీఎం ఆవాస్ యోజనలో కేంద్ర, రాష్ట్ర వాటాలను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో నాయకులు ఎండీ తాజ్, వెన్నం రజిత రెడ్డి, మాదాసు శ్రీనివాస్, చింతల్ కిషన్, కూడలి శ్రీధర్, అబ్దుల్ రెహమాన్, అమీర్, కుంభాల రాజు కుమార్, సామ్రాట్, బొమ్మరాతి సాయి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

**త్రిశక్తి ఆలయంలో అమ్మవారికి లక్ష గాజుల అర్చన**

**ముద్ర, కోరుట్ల;** శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రోజు పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో, అష్టలక్ష్మి సహిత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, కాలేజ్ వద్ద గల దుర్గా ఆలయం త్రిశక్తి మాత ఆలయం లో, సామూహిక వరలక్షి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహానికి పాలు, పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలచే సామూహిక వరలక్షి వ్రతాలు నిర్వహించి, లలిత సహస్రనామ పారాయణం చదివారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. పూజానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం త్రిశక్తి మాత ఆలయంలో అమ్మవారికి అంగరంగ వైభవంగా లక్ష గాజుల అర్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.









కరీంనగర్ లో

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 22.08.2026
www.mudranews.in | @mudranews



**చమట దుర్వాసనకు**
చంకల వెంట్రుకలను శుభ్రంగా ఉంచాలి. అధిక వెంట్రుకల్లో చెమట, బ్యాక్టీరియా ఎక్కువసేపు ఉండే అవకాశం ఉంటుంది. క్రమం తప్పకుండా శుభ్రంగా ఉంచడం మంచిది.


## దేవరకొండలో న్యాయ విజ్ఞాన సదస్సు




**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ కే.అనిత, జూనియర్ సివిల్ జడ్జిలు కె.వి.ఎస్. హరీష్ బాబు, స్నేహ పాల్గొన్నారు. కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని, యువత గంజాయి బారిన పడకుండా చూడాలని, మైనర్ వివాహాలు, శిశువిక్రయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నాయిల ఉమామహేశ్వర్, సెక్రటరీ వనం జగదీశ్వర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 21 :** ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (SIR) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. సంజీవరెడ్డి భవన్ లో నిర్వహించిన అత్యవసర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మండల, పట్టణ అధ్యక్షులందరూ బూత్ స్థాయి సూపర్‌వైజర్లుగా బాధ్యతలు స్వీకరించాలన్నారు. ఈ నెల 25వ తేదీ నాటికి మండల, పట్టణ కమిటీలను, 30 నాటికి గ్రామ, వార్డు కమిటీల నియామకాలను పూర్తి చేయాలని ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీని 'జాతి వ్యతిరేకి' అని విమర్శించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను బీజేపీ ప్రభుత్వం అడ్డుకోవడాన్ని నిరసించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, వివిధ విభాగాల అధ్యక్షులు, డీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలు తాగునీటికే ప్రాధాన్యం

### కలెక్టర్ దివాకర టిఎస్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 21 :** కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గోదావరి నుంచి తరలిస్తున్న నీటిని తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యతగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువుల నీటి ప్రవాహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పల్లిపాడు–ఏన్కూర్ మార్గంలోని నిమ్మవాగు, సీతారామ కాలువ 18ఎల్ లింక్, ఏన్కూరు వద్ద ఎన్ఎస్‌పీ 52వ కిలోమీటర్ రెగ్యులేటర్, కల్లూరు వద్ద మధిర బ్రాంచ్ కెనాల్, పుణ్యపురం మేజర్ కాలువ, కప్పలబంధం, ఏపీ–తెలంగాణ సరిహద్దు రెగ్యులేటర్ సహా వేంసూరు మండలంలోని లంకాసాగర్ చెరువును పరిశీలించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా బేసిన్‌లో వర్షపాతం తగ్గిందని, జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్ల ద్వారా నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఇరిగేషన్ సీఈ వాసంతి, ఎస్ఈలు ఎం.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, ఈఈలు బాబురావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన



కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. శ్రావణ మాసం సందర్బంగా శ్రీ పద్మావతి అమ్మవారికి నిత్యార్చనలు పూర్తి అయిన తరువాత, నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని పట్టు చీరతో దివ్యాభరణాలతో పుష్ప మాలికలతో అలంకరించి అష్టలక్ష్మి మంటపంలో కొలువుదీర్చారు. అష్ట ఐశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హోవనం నిర్వహించారు. సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## సమాజ మార్పు కోసం పోరాటమే హీరోయిజం

### కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 21 :** కమ్యూనిస్టు సైద్ధాంతిక పునాదులు, యువత బాధ్యత, వర్తమాన రాజకీయాంశాలపై కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. కొదుమూరు లో జరిగిన ఏఐవైఎఫ్ 25వ ఖమ్మం జిల్లా మహాసభల వేదికగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.సమాజంలో మార్పు కోసం సమయాన్ని బట్టి ప్రజలే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి పోరాడుతారని, ఇటీవల 'జెన్ జీ' తరం యువత ముందుకు వచ్చి చేసిన పోరాటాలే దానికి ప్రత్యక్ష నిదర్శనమని గుర్తుచేశారు. కేవలం "పుట్టామా, పెరిగామా, పెళ్లి చేసుకున్నామా, చచ్చామా" అనేలా బ్రతకడం అసలైన జీవితం కాదని, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామ రాజుకు కూడా కుటుంబం ఉన్నప్పటికీ, దేశం కోసం పోరాడలేదా అని ప్రశ్నించారు. చేతుల్లో కర్రలు పట్టుకుని తిరిగినంత మాత్రాన దేశభక్తి ఉన్నట్లు కాదని, శరీరంలో అణువణువు దేశభక్తి, ప్రజల పట్ల తపన ఉన్నవాడే నిజమైన కమ్యూనిస్టు అని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్రను ప్రస్తావిస్తూ సీపీఐ నుంచి సీపీఎం, సీపీఎం నుంచి విప్లవాత్మక ఎంఎల్ పార్టీలు ఉద్భవించాయని, రూపాంతరం చెందినప్పటికీ అన్నింటిదీ ఒకే ఎర్ర రంగు అని వ్యాఖ్యానించారు. వామపక్ష పార్టీలన్నింటికీ




సీపీఐ తల్లి లాంటిదని పేర్కొన్నారు. చివరికి నక్సలైట్లకు కూడా కులాలు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో మానవాళిని దోపిడీ లేని సమాజం వైపు నడిపించే ఏకైక సిద్ధాంతం 'సోషలిజం' మాత్రమేనని ఉద్ఘాటించారు. ఆగస్టు 15న ప్రధాని మోడీ పదే పదే 'దిమాగీ నక్సల్స్' అని మాట్లాడారంటేనే ఎర్రజెండా సిద్ధాంతానికి ఎంత భయపడుతున్నారో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. పాన్లు, గుట్కాలు నమలడం, అమ్మాయిలను వేధించడం ఎంతమాత్రం 'హీరోయిజం' కాదని, ఆరోగ్యకరమైన, దృఢమైన శరీర సౌష్టవంతో సమాజ హితం కోసం నిలబడటమే నిజమైన నాయకత్వమని హితవు పలికారు.ఒకప్పుడు ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల ఖిల్లా అని, అప్పుడే కాదు... నిప్పులాంటి ఉద్యమాలతో ఈనాటికీ ఖమ్మం కమ్యూనిస్టుల ఖిల్లానే అని ఆయన స్పష్టం చేశారు.మహాసభకు ముందు యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా ఏఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు, అమర వీరుల స్థూపాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. మహమ్మద్ గౌస్ పాషా, అబ్బూరి మహేష్, దండి శ్రీజ, మామిడి కిరణ్, యమునా అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలివుల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర , సిపిఐ జాతీయ సమితి సభ్యుల భాగం హేమంతరావు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి , నానబాల రామకృష్ణ తదితరులు ప్రసంగించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, షేక్ జానీ మియా ఏపూరిల తాదేవి బిజె క్లెమెంట్ పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు కూచిపూడి రవి ఆహ్వాన సంఘం అధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి శ్రావణ్, చింతల రమేష్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు

## వీడీఎన్ ఏసీ కన్వెన్షన్ హాల్ ప్రారంభం

### ముఖ్య అతిథులుగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బాలు నాయక్

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి గ్రామ శివారులో అధునాతన టెక్నాలజీతో నూతనంగా నిర్మించిన విడిఎన్ ఏసి కన్వెన్షన్ హాల్ ను తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ కొండమల్లేపల్లి పట్టణం వాణిజ్య వ్యాపార పరంగా ఎదగడం ఎంతో శుభ పరిణామం అన్నారు. ఏసీ కన్వెన్షన్ హాల్ ను వివాహ ది శుభకార్యాలకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులకు విడిఎన్ ఏసీ



కన్వెన్షన్ హాల్ నిర్వాహకులు రిటైర్డ్ ఆర్డీఓ వడ్త్య విజయ శక్రు నాయక్, దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య ప్రియాంక దేవేందర్ నాయక్ ముఖ్య అతిథులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, డిసిసి ఉపాధ్యక్షులు ఆలంపల్లి నరసింహ, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ పందుల వెంకటయ్య, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగెందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి ఉట్కూరి వేమన్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, సంజీవని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, దేవరకొండ నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు, మండలాల ముఖ్య నాయకులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

### :రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సజావుగా కొనసాగేందుకు ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం, హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం వెంటనే రూ. 2,800 కోట్లు విడుదల చేసిందని, ఇందుకు ముఖ్యమంత్రి



ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,నీటిపారుదల శాఖ ఎస్ఈ రవీందర్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉద్యోగి మృతిపట్ల సంతాపం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మున్సిపాలిటీ ఔట్ సోర్సింగ్ శానిటేషన్ విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్న చింతల విజయ్ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె. చంద్ర ప్రకాష్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, చింతల విజయ్ కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపి భువనగిరి మున్సిపాలిటీ తరపున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. వార్డు సభ్యులు పాలత్యా వెంకటేశ్, కో–ఆప్షన్ సభ్యులు పల్లెర్ల యాదగిరి, నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ పనులు నత్తనడక పై నిరసన




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం ఆగస్టు 21 :** ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు సంవత్సరాల తరబడి నత్తనడకన సాగుతుండటంపై సీపీఎం పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ప్రయాణికులకు తీవ్ర తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న కాంట్రాక్టర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రూ.34 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారాయని, కనీసం మంచినీటి సౌకర్యం లేక, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఏసీ వెయిటింగ్ హాల్ పనులు పూర్తికాక వేలాది మంది ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాన ద్వారం, టికెట్ కౌంటర్ హాల్, అధికారుల ఆఫీసుల పనులన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయాయని, 3 ఏళ్లుగా పనులు ఆలస్యమవుతున్నా ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకపోవడం శోచనీయమన్నారు.రాబోయే మూడు నెలల్లో ఆధునీకరణ పనులన్నీ పూర్తి చేయకపోతే రైల్వే స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, ఎం.ఏ.జబ్బార్, దొంగల తిరుపతిరావు, భూక్యా శ్రీనివాసరావు, ఎస్.కే.నాగుల్ మీరా, బోడపట్ల సుదర్శన్, వజ్జినేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మోతే దంపతుల హత్య కేసు: కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్ డిస్మిస్

**ముద్ర, సూర్యాపేట:** మోతే మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అతడిని పోలీస్ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ (డిస్మిస్) జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.మోతే మండల కేంద్రంలోని వ్యవసాయ భూమిలో భార్యాభర్తల మృతదేహాలను పాతిపెట్టిన ఘటనపై మోతే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో కేవలం 24 గంటల్లోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులో మోతే పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహమ్మద్ షరీఫ్ ప్రధాన నిందితుడిగా తేలడంతోపాటు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు. చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీసు ఉద్యోగంలో ఉండి దారుణ హత్యకు పాల్పడటం తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించిన ఎస్పీ అతడిపై కఠిన చర్యలు తీసుకున్నారు.కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లను కూడా నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు అధికారిగా డీఎస్పీని నియమించారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం త్వరగా అందేలా చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా సొంత శాఖకు చెందిన వారైనా ఉపేక్షించేది లేదని, చట్టం ముందు అందరూ సమానులేనని జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది.

## రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐలు అజ్మీరా రమేష్, ముత్యాల రామ్మూర్తి, పోలీసు అధికారులకు నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ హైస్కూల్ యాజమాన్యం జాజి రెడ్డి, రాణి రెడ్డి, కొండమల్లేపల్లి పట్టణ జేబీ కాలనీవాసులు, పాఠశాల విద్యార్థులు జిల్లా పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ను కలిసి జిల్లా పోలీసు అధికారులు, దర్యాప్తు బృందం రాత్రింబవళ్లు శ్రమించి కేసును త్వరితగతిన ఛేదించిన తీరును అభినందించారు. ఘటనతో భయాందోళనకు గురైన తమకు పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు భరోసా నమ్మకాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసులో చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసి దర్యాప్తు పూర్తిచేసి న్యాయస్థానంలో త్వరితగతిన చార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలుగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజల భద్రత నేర నియంత్రణకు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రతి కాలనీ ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మీ చుట్టూ ఉన్న పరిసరాలలో నిషేధిత గంజాయి ఆనవాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని ఎలాంటి అనుమానాలున్నా స్థానిక పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఎస్పి సూచించారు. వారి వెంట కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, జేబీ కాలనీ వాసులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## బీసీఐ చైర్మన్ రాజీనామా చేయాలి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రామన్నపేట కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి నిరసన తెలిపారు.బీసీఐలో అధికార కేంద్రీకరణ ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమని విమర్శించారు. నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దన్న ఆదేశాలు ఏకపక్షమని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే చర్యలను ఖండించారు. రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యాన్ని నిలిపివేయాలని, బీసీఐ వ్యవహారాలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వంచ జగతయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, గడ్డం నరసింహ, వీరమల్ల నర్సింహ, అంతటి రమేష్, అంకం నరేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 22.08.2026
www.mudranews.in | @mudranews



### చమట దుర్వాసనకు

రోజూ శుభ్రంగా కడుక్కోవాలి. చంకలను రోజూ సబ్బు లేదా మైల్డ్ క్లెన్సర్‌తో శుభ్రంగా కడిగి పూర్తిగా ఆరబెట్టుకోవాలి.



# 26న దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరం

**చేయూత పెన్షన్ల పరిష్కారానికి కలెక్టరేట్ లో హెల్ప్ డెస్క్**
**కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** దివ్యాంగుల కోసం ప్రత్యేక యుడిఐడి శిబిరం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. 8008556112 చేయూత పెన్షన్లు హెల్ప్ డెస్క్ నెంబర్ ను సంప్రదించాలన్నారు.చేయూత పింఛన్ల దరఖాస్తులు మండల, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే దరఖాస్తుదారులు కలెక్టర్ కార్యాలయంలో గల హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు.ఇంకా ఎవరైనా దివ్యాంగులు యూడిఐడి ధ్రువీకరణ పత్రం లేనివారు



తక్షణమే మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకుని ఈనెల 26న మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇంకా మిగిలి ఉన్న వారు మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.23 అర్ధరాత్రి నుండి చేగుంట ఆర్ఓబి పనులు చేగుంట వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఈనెల 23




అర్ధరాత్రి 12 గంటల నుండి ప్రారంభమవుతాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.ఈ నేపథ్యంలో వాహన దారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. చేగుంట నుండి మెదక్ వైపు రహదారి రాకపోకలను నిర్మాణ పనులు పూర్తి అయ్యే వరకు తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత వేడుకలు



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ వాసవి మాత ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రత పూజలను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా విష్ణుసహస్రనామాలు తదితర పూజా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు ఊరె జనార్ధన్, ప్రధానకార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, రాచమల్ల నర్సింహ, నీలా లక్ష్మయ్య, సముద్రాల ధనయ్య, దాచేపల్లి నరేందర్, తోట నరసింహ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అసోసియేషన్ కు ఎన్నికైంది వీరే..

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, ఆర్ఎస్సై నరేష్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సాయిలు, పీసీలు ఉపేందర్, సీమన్, రాము, అభిలాష్, సాయి, పరమేశ్వర్, నర్సింలు, రేణుక ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఎన్నికల్లో రాజా గౌడ్, సతీష్, వినోద్, సాజిద్, సత్యనారాయణ, విజయ్, కిరణ్, విజయ్, గంగమణి, భాగ్యలక్ష్మి, సరితలు గెలుపొందారు.




## తాండూర్ కాగ్న వంతెనకు మరోసారి రంధ్రం

**ముద్ర ప్రతినిధి, తాండూరు :** తాండూరు–కొడంగల్ మార్గంలోని కాగ్నానదిపై నిర్మాణమైన బ్రిడ్జ్ కు తాజాగా మరోసారి రంధ్రం ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో బ్రిడ్జిపై భారికెడ్లు పెట్టి పోలీసులు, రోడ్డు భవనాల శాఖ అధికారులు రాకపోకలను నియంత్రిస్తున్నారు. సరిగ్గా గత యేడాది జులై మాసంలో మొదటి సారి రంధ్రం ఏర్పడింది.తాజాగా రెండోసారి మరో రంధ్రం పడింది. గత ఐదేళ్లలో రెండుసార్లు రంధ్రాలు పడడంతో వంతెన నాణ్యతపై అనుమానాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాగ్నానదిపై కొత్త వంతెనను నిర్మించారు. సుమారు ఐదేళ్ల క్రితం నుంచి వంతెనపై రాకపోకలు సాగుతున్నాయి.గత ఏడాది జులై నెలలో కాగ్నానదిపై రంధ్రప్రం ఏర్పడింది. సంబంధిత శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టెక్నాలజీతో మరమ్మత్తులు చేయించారు. ఇది పూర్తి అయిన యేడాదిలో కాగ్నానది ప్రమాదంలో పడింది. తాజాగా



శుక్రవారం మరో రంధ్రం పడినట్లు వెలుగులోకి వచ్చింది. వంతెన రోడ్డుపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. దానిపై నుంచి వెళ్లకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేశారు.అయితే బ్రిడ్జి నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ ఏ మేరకు జరిగిందనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడం వల్లే కాగ్నా బ్రిడ్జికి తరచుగా రంధ్రాలు పడుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** 12వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ అండర్– 14, 16, 18, 20 బాల బాలికలకు మెదక్ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించారు. త్రోస్, రన్స్, జంప్స్ విభాగాల్లోఎంపికలు జరిగాయి. మెదక్ జిల్లా నలుమూలల నుండి 450 క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్ క్రీడాన్ ప్రారంభించారు. డివైఎస్ఓ గంగాల రమేష్ మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణర్థి వెంకట రమణ, ఏ. మధుసూదన్, పీడీ సుజాత, రాజేందర్, మహిపాల్, ప్రకాష్, పూర్ణచందర్, అర్జున్, క్రీడాకారులు పాల్గొన్నారు.ఉత్తమ ప్రతిభగ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్ వేసి అభినందించారు. ఈనెల 26, 27 తేదీలలో వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారు.



## పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకై సిపిఎం పాదయాత్ర

**31న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నా**
**రాజకీయాలకతీతంగా రైతాంగం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండిజహంగీర్**



**ముద్ర, బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీబీనగర్ లో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎండి జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్ లకు నిధులు విడుదల చేసి, ప్రాజెక్టులు పూర్తి చెయ్యాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29,30,31 తేదీలలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, 31 న చలో హైద్రాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాలో అధిక సంఖ్యలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా నూతనంగా ఏర్పడి దశబ్ద కాలం గడచినప్పటికీ జిల్లాలో ఇప్పటివరకు ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ పురోగతి సాధించలేదని అన్నారు. జిల్లాకు వ్యవసాయమే ప్రదాన జీవనాధారంగా లక్షలాది మంది చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతాంగం వ్యవసాయంపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. బునాదిగాని కాల్వ, పిల్లాయిపల్లి కాల్వ, ధర్మారెడ్డిపల్లి కాల్వ లకు నిధుల కొరత నివారించి నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్ట్ లకు నిధులు విడుదల చేసి ప్రాజెక్ట్ లు పూర్తి చెయ్యాలని ఆగస్టు 31 న చలో హైద్రాబాద్ ఇందిరా పార్క్ లో జరిగే మహాధర్నా లో రైతులు వ్యవసాయ కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ సమావేశానికి ఎరుకలి బిక్షపతి అధ్యక్షత వహించగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మండల కార్యదర్శి బండారు శ్రావణ్ కుమార్, మండల కమిటీ సభ్యులు రేసు రామచంద్రారెడ్డి, బాలబోయిన జంగయ్య, ఎస్డి ఉమర్, మేకల బాబు, ఓవల్దాస్ సతీష్ పాల్గొన్నారు.

## కనుల పండుగగా వరలక్ష్మీ వ్రతం పూజలు

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మి వ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో ఆడపడుచులు కనుల పండుగ నిర్వహించారు. సంగం రామాలయంలో రాహుల్ దాస్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. చార్మినార్ భాగ్యలక్ష్మి, బాలాజీ ఆలయాల్లో శృంగారం ఆత్రేయ స్వామి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. లంగర్ హౌస్ లో సాయి టెక్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు ముత్యాల లీలావతి గృహంలో ముత్యాల శేఖర్ బాబు సుమలతలు వేద పండితుల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా బంధుమిత్రులను పిలిచి పసుపు కుంకుమ, వాయినాలు అందజేశారు. అనంతరం నోరూరించే వివిధ రకాల వంటకాలతో విచ్చేయుచున్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## అనుమానాస్పద స్థితిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

**ముద్ర, కూకట్‌పల్లి:** కెపిహెచ్‌బి కాలనీలోని ఓ హాస్టల్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మల్లిపెద్ది యామిని (23) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, కావూరు గ్రామానికి చెందిన మల్లిపెద్ది సుబ్బారావు పెద్ద కుమార్తె యామిని హైదరాబాద్ కేపీహెచ్‌బి రోడ్ నంబర్–1లోని పీజీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది.ఆగస్టు 20న రాత్రి 8:50 గంటల సమయంలో హాస్టల్ గదిలో రూమ్‌మేట్స్ లేని సమయంలో యామిని ఉరివేసుకుని సూసైడ్ చేసుకుంది. సమాచారం అందుకున్న కెపిహెచ్‌బి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, ఆమె అప్పటికే మృతిచెంది ఉంది. అనంతరం పోలీసులు మృతురాలి తండ్రి సుబ్బారావుకు సమాచారం అందించారు.



హాస్టల్‌కు చేరుకున్న తండ్రి విచారించగా, గతంలో విజ్ఞాన్ యూనివర్సిటీలో చదివే రోజుల్లో రోషన్ అనే యువకుడితో యామినికి పరిచయం ఉందని, వారిద్దరూ కొంతకాలంగా మాట్లాడుకుంటున్నారని తెలిసింది. వారి మధ్య ఏవైనా గొడవలు లేదా సమస్యలు రావడం వల్లే తన కుమార్తె ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందేమోనని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కెపిహెచ్‌బి పోలీసులు కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు గల పూర్తి కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

## టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీకి పరామర్శ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్రఅధ్యక్షులు విరహత్అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసాబేగం అనారోగ్యంతో మృతి చెందారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో గురువారం టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరహతఅలీ ని యాదాద్రి భువనగిరి జిల్లా యూనియన్ నాయకులు కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాతృమూర్తి ఉన్నిసాబేగం మృతి పట్ల అశ్రుని వాళ్ళ అర్పించారు. పరామర్శించిన వారిలో ఐ జే యు జాతీయ కౌన్సిల్ సభ్యులు జీవి శ్రీనివాస్, ఎలిమినేటి ఇంద్రారెడ్డి టియుడబ్ల్యూజే (ఐజేయు) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు యంబ నరసింహులు, జిల్లాప్రధానకార్యదర్శి , పోతంశెట్టి కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెలిమినేటి జహంగీర్, జిల్లా నాయకులు కందుకూరీ సోమయ్య, పట్టణ మాజీ కార్యదర్శి జమాలుద్దీన్ తదితరులున్నారు.

# గోల్కొండ కోట వద్ద 400 సంవత్సరాల సొరంగం

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** చారిత్రాత్మక గోల్కొండ కోట వద్ద పెద్ద గుంత బయటపడింది. గోల్కొండ నుండి చార్మినార్ వరకు ఏర్పాటు చేసిన సొరంగ మార్గమే అయి ఉంటుందని అధికారులు, స్థానికులు అంచనా వేస్తున్నారు. పురావస్తు శాఖ అధికారులు వాటిని పరిశీలించి నిజాలు వెల్లడిస్తామన్నారు. వివరాల్లోకి వెళితే..... గోల్కొండ కోట వెనుక భాగంలో ఆర్మీ అధికారులు అగ్ని వీరుల కోసం అట్టారా సిడి ప్రాంతంలో సన్నాహక కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అక్కడ స్థలాన్ని చదును చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడ పెద్ద గుంత, పురాతన నిర్మాణం బయటపడింది. గతంలో గోల్కొండ దగ్గరలో ఉన్న షేక్పేట్ 7 టూంబ్స్ వద్ద ఇలాంటి గుంత నిర్మాణం బయటపడింది. అక్కడ పరిశీలించగా అది అక్కడి నుండి గోల్కొండ కోటలోకి సొరంగ మార్గంగా నిర్ధారించారు. అయితే గోల్కొండ నుండి చార్మినార్ వరకు సొరంగ మార్గం ఉందని చరిత్రలో చెబుతున్నారు. తాజాగా గుంత నిర్మాణము బయటపడడంతో ఇది చార్మినార్ కు ఉన్న సొరంగ మార్గమే అని స్థానికుల్లో ఊహగానాలు పెరిగాయి. విషయం తెలుసుకున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్



ముమైనుద్దీన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఇది 400 సంవత్సరాల క్రితం నిర్మించిన సొరంగం మార్గం లాగానే కనిపిస్తుందని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి నిజాలు తేల్చాలని కోరారు. దీంతో పురావస్తు శాఖ అధికారులు ఏ ఎస్ ఐ హైదరాబాద్ అధికారులకు సంప్రదించారు. కొందరు ఈ ప్రాంతంలో పర్యటించారు. ఇది భూగర్భ గది అని భావన....ఏ ఎస్ ఐ అధికారులు



ప్రాథమిక తనిఖీల్లో ఇవి చిన్నటి భూగర్భ గదులు అని నిర్ధారిస్తున్నారు. గోల్కొండ కోట గోడకు 100 మీటర్ల దూరంలో ఈ అవశేషాలు బయట పడ్డాయి అన్నారు. ఇది మధ్యయుగం కాలంనాటివని, చుట్టుపక్కల ఇలాంటివి ఇంకా ఎన్ని ఉన్నాయో తనిఖీలు చేస్తామన్నారు. లోపలి భాగంలో వందల సంవత్సరాల కాలం నాటి మట్టి పాత్రలు, ఎర్ర మట్టితో నిర్మించిన కట్టడాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మరిన్ని తనిఖీలు, వాటి పరిశోధనలు చేశాకే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555